

సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ దేశంలోనే ఆదర్శంగా అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేస్తోంది. రూ.4,000 పెన్షన్, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు సహా సుమారు రూ.70 వేల కోట్ల సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



సోమవారం 17.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 117 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# గడప గడపకూ సంక్షేమ సందేశం

- 61.61 లక్షల ఇళ్లతో మమేకం
- 21 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ శ్రేణుల విస్తృత పర్యటన
- ఒక్కరోజులోనే 2.60 లక్షల కుటుంబాలను కలిసిన నాయకులు, కార్యకర్తలు





**అమరావతి, ఆగస్టు 16(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను ప్రతి కుటుంబానికి వివరించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలను నేరుగా తెలుసుకునే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న "ఇంటింటికీ తెలుగుదేశం – 2ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమం మరో కీలక మైలురాయిని అధిగమించింది. రాష్ట్రవ్యాప్తంగా 60 లక్షల ఇళ్ల సందర్శనల మార్క్‌ను దాటి, 21 రోజుల్లో మొత్తం 61.61 లక్షల ఇళ్లకు టీడీపీ శ్రేణులు సందర్శించారు. 21వ రోజు కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. నేడు 2.60 లక్షల ఇళ్లను సందర్శించి ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. ప్రతి ఇంటి వద్ద కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, వివిధ వర్గాలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. 60 లక్షల ఇళ్ల మైలురాయిని అధిగమించడం 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమానికి ప్రజలతో పార్టీ శ్రేణుల ప్రత్యక్ష అనుసంధానానికి నిదర్శనంగా నిలిచింది. ప్రతి ఇంటి వద్ద రైతు సంక్షేమం, మహిళలు–యువతకు అందుతున్న ప్రయోజనాలు, పేదల సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన తదితర అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. అదే సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మిగతా 2లో...




# సభా సమరం షురూ!

- నేటి నుంచి ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు
- వైసీపీ బహిష్కరణతో అసెంబ్లీలో కూటమి.. మండలిలో హాట్ హాట్ చర్చ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఉభయ సభలను సమావేశపర్చనున్నారు. అయితే, వైసీపీ.. అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించాలని నిర్ణయించడంతో ఈసారి కూడా సభ కూటమి సభ్యులతోనే జరగనుంది. ప్రతిపక్ష నేత (ఎల్ఓపీ) హోదా నిరాకరణకు నిరసనగా తమ బహిష్కరణ కొనసాగుతుందని వైసీపీ ఇప్పటికే స్పష్టం చేసింది.

మరోవైపు, ఈ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం, రైతుల సమస్యలు, అమరావతి రాజధాని నగర నిర్మాణ పనుల పురోగతి వంటి అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఈ అంశాలపై అధికారపక్షం తన వాదనను వినిపించనుంది.

**స్పీకర్ ఆహ్వానం.. వైసీపీ తిరస్కరణ :** సమావేశాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం తెలిపారు. వైసీపీ సభ్యులు సభకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే, సంబంధిత మంత్రుల నుంచి సమాధానాలు ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై చర్చించడం, తమ నియోజకవర్గాల వాణిని వినిపించడం శాసనసభ్యుల బాధ్యత అని, జగన్‌తో సహా వైసీపీ ఎమ్మెల్యేలందరూ సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో, అసెంబ్లీకి హాజరుకాని ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు చెల్లించాలని స్పీకర్ ప్రశ్నించారు. ఈ అంశంపై పార్లమెంటులో చర్చించి, తగిన చట్టం తీసుకురావాలని కూడా ఆయన సూచించడం గమనార్హం.

**మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: జగన్**

అసెంబ్లీని బహిష్కరిస్తున్నప్పటికీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై గళం విప్పాలని వైసీపీ నిర్ణయించింది.- 2లో...

# ఏనుగుల కదలికలపై నిఘా

- అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలి: పవన్
- గ్రామాల్లో మైకులు, మొబైల్ సందేశాలతో ముందస్తు హెచ్చరికలు

**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్) :** తిరుపతి జిల్లా చంద్రగిరి సమీప ప్రాంతాల్లోని ఎర్రవారిపాలెం వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, ధైర్యం చెప్పాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ మరియు పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, డ్రోన్ల సహాయంతో వాటి సంచార మార్గాలను గుర్తించి సమీప గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలోని ఏనుగులు రెండు గుంపులుగా సంచరిస్తూ రాత్రివేళ అటవీ సరిహద్దుల్లోని పంట పొలాలను ధ్వంసం చేస్తున్నాయన్న సమాచారంపై పవన్ కళ్యాణ్ అటవీశాఖ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆస్తి, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ ప్రత్యేక గస్తీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలు రాత్రివేళ పొలాలకు వెళ్లకుండా అవగాహన కల్పించడంతోపాటు అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.




ఏనుగుల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో మైకులు, మొబైల్ సందేశాలు, స్థానిక సమాచార వ్యవస్థల ద్వారా హెచ్చరికలు జారీ చేయాలన్నారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసరమైన చోట హనుమాన్ (న.హా. చి. ఖ. వీ.హా. చి. ) బృందాలను మోహరించి ప్రజల భద్రతను నిర్ధారించాలి. క్షేత్ర స్థాయి సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ అటవీశాఖ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఏనుగులు పంట పొలాలపై దాడి చేసి పంటలను ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో, పంట నష్టంపై అధికారులు నివేదికలు రూపొందించిన వెంటనే అటవీశాఖ ద్వారా తక్షణ పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

# ముగిసిన టెట్-2026



- 11 రోజుల పాటు ప్రశాంతంగా సాగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష
- 2.18 లక్షల మంది హాజరు.. 91.61 శాతం అటెండెన్స్

2లో

# ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు

- మూడు నెలల వేతనాలకు రూ.22.50 కోట్లు విడుదల
- త్వరితగతిన చెల్లింపులు చేపడతాం: వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాల చెల్లింపునకు కూటమి ప్రభుత్వం రూ. 22.50 కోట్లను మంజూరు చేసింది. 2లో

# బీసీల అభ్యున్నతే లక్ష్యం

- గౌతు లచ్చన్న ఆశయాలతో కూటమి పాలన: మంత్రులు
- బీసీలను అన్ని రంగాల్లో ముందంజలో నిలపడమే చంద్రబాబు ధ్యేయం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సర్దార్ గౌతు లచ్చన్న స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, బీసీలను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్నింటా ముందంజలో నిలబెట్టేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తెలిపారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలన్న ఉద్దేశంతోనే ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. బీసీలను గత ప్రభుత్వం లో వేధిస్తే, సీఎం చంద్రబాబు అక్కున చేర్చుకున్నారన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, అచ్చెన్నాయుడు తొలుత గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం మంత్రులు ప్రసంగించారు. గౌతు లచ్చన్న 117వ జయంతిని జరుపుకోవడం ఆనందంగా ఉందని మంత్రి సవిత తెలిపారు. 1909



ఆగస్టు 16న గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా బారువా గ్రామంలో సామాన్య గౌడు కుటుంబంలో జన్మించారన్నారు. తన 21వ ఏటనే గాంధీజీ పిలుపు మేరకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. ఆ ఉద్యమంలో గౌతు లచ్చన్న వెన్నుచూపని పోరాటం చేశారని, జైలు శిక్షలు సైతం అనుభవించిన యోధుడని కొనియాడారు.

అణగారిన వర్గాలు, బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం తుది శ్వాస విడిచిపెట్టే వరకూ పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా బీసీలు, రైతులు, శ్రామికుల అభ్యున్నతికి కృషి చేశారన్నారు.. గౌతు లచ్చన్న ఆశయాల సాధనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. అన్న ఎన్టీఆర్ బీసీల అభ్యున్నతి కోసం మన పార్టీ ని స్థాపించారన్నారు. బీసీలకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తున్నాయన్నారు. విద్యతోనే బీసీలు అభివృద్ధి చెందుతారని నమ్మిన వ్యక్తి సీఎం చంద్రబాబు అని అన్నారు. అందుకే, రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకులాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గౌతు లచ్చన్న జయంతిని జరగకుండా గత పార్టీ నేత తన హయాంలో అడ్డంకులు సృష్టించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, మిగతా 2లో...

# డ్రోన్ల విధ్వంసం.. రష్యా విలవిల

- మాస్కో సహా 17 ప్రాంతాలపై ఉక్రెయిన్ దాడులు
- గిడ్డంగుల్లో భారీ మంటలు.. ఆరుగురు మృతి, పలువురికి గాయాలు

**మాస్కో :** రష్యాపై ఉక్రెయిన్ భీకర వైమానిక దాడులు జరిపింది. గిడ్డంగులు, పారిశ్రామిక ప్లాంట్లు, రిఫైనరీలు సహా రష్యాకు చెందిన పలు లక్ష్యాలపై



# దేశం మెచ్చిన ఏపీ ఏఐ ఏజెంట్

- వాణిజ్య పన్నుల శాఖలో కృత్రిమ మేధతో నెలకు రూ.600--750 కోట్ల అదనపు ఆదాయం
- 6-8 వారాల పని.. ఇక 2-3 గంటల్లోనే పూర్తి




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో కృత్రిమ మేధ (ఏఐ) అద్భుతాలు సృష్టిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

# సీజేను కలిసిన న్యాయాధికారులు

- జస్టిస్ లీసా గిల్‌తో న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలపై భేటీ
- అసోసియేషన్ ప్రతినిధులతో సానుకూలంగా చర్చించిన సీజే

**అమరావతి, ఆగస్టు 16(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం అమరావతిలోని రాష్ట్ర హైకోర్టు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో న్యాయవ్యవస్థకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది. మిగతా 2లో...



# భవితకు భరోసా.. ప్రసంగాల్లో ప్రగతి దిశ

- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సందేశాలు ప్రజల్లో నమ్మకం నింపాయి
- ప్రగతి నిరోధక 'మానసిక తీవ్రవాదుల'పై ప్రధాని హెచ్చరిక: సత్యకుమార్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** దేశ 80వ స్వాతంత్ర దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రగతి వ్యతిరేక 'మానసిక తీవ్రవాదుల' పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారని, మన రాష్ట్రంలో కూడా అలాంటి వ్యక్తులున్నారని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. గత 12 ఏళ్లుగా కేంద్రంలోని కూటమి ప్రభుత్వం ఎంతో వ్యయప్రయాసలకోర్చి దేశ ప్రగతి కోసం పలు విజయాలు, సత్ఫలితాలు సాధించినా.. ఏమీ జరగలేదంటూ ప్రజల్లో నిరాశ, నిస్పృహలకు పురికొల్పే 'మానసిక తీవ్రవాదులు' (దిమాగీ టెర్రరిస్టులు) నిరంతరం పొంచి ఉన్నారని శనివారం ఢిల్లీలోని ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని వివరించారని తెలిపారు.

**ఆ కోవలోని వ్యక్తి జగన్‌రెడ్డి :** ప్రధాని పేర్కొన్న ప్రగతి వ్యతిరేక 'మానసిక తీవ్రవాదానికి' నిలువెత్తు సాక్షాత్కారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు కూటమి ప్రభుత్వానికి అఖండ విజయాన్ని కలిగించినప్పటి నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఉజ్వల భవితకు బహుముఖ వ్యూహాలతో నిరంతరం శ్రమిస్తూ పలు సత్ఫలితాలు సాధిస్తున్నప్పటికీ ప్రజల్లో అపోహలు సృష్టించడానికి జగన్‌రెడ్డి నానా పాట్లు పడుతున్నారని, మానసిక తీవ్రవాద చర్యలకు జగన్‌రెడ్డి నాయకత్వం వహిస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా దుయ్యబట్టారు. మిగతా 2లో...



# భోగాపురం 'టేకాఫ్'



- నేటి నుంచే విమానాల రాకపోకలు ప్రారంభం
- తొలి రోజే 31 సర్వీసులు.. ఏడు ప్రధాన నగరాలకు అనుసంధానం

**భోగాపురం (జర్నలిస్ట్ ఫైల్) :** అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం నుంచి విమానాల రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 6.45 గంటలకు ఇండిగో విమానం హైదరాబాద్ నుంచి భోగాపురం రానుంది. ఉదయం 7.30 గంటలకు భోగాపురం నుంచి హైదరాబాద్‌కు మరో ఇండిగో విమానం టేకాఫ్ కానుంది. ఉదయం 7.30 గంటలకు బెంగళూరు నుంచి ఎయిరిండియా విమానం భోగాపురం ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కానుంది. మిగతా 2లో...

# రైతుకు మేలు జరిగితే సాక్షికి ఎందుకింత కడుపుమంట?

- పంటల బీమాపై తప్పుడు ప్రచారంతో రైతులను తప్పుదోవ పట్టించొద్దు
- ఎల్‌నినో ముప్పు నేపథ్యంలో ప్రతి రైతుకూ బీమా రక్షణే ప్రభుత్వ లక్ష్యం
- ఖరీఫ్-2026లో బీమా దరఖాస్తులు 35.17 లక్షలు.. 80 శాతం పెరుగుదల
- బీమా విస్తీర్ణంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌కు 5వ స్థానం
- గత ప్రభుత్వం పెట్టిన ?1,990 కోట్ల ప్రీమియం బకాయిలపై సాక్షి ఎందుకు మాట్లాడదు?
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు మేలు చేయాలనే సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున పంటల బీమా నమోదు చేపడితే దానిని కూడా వక్రీకరిస్తూ సాక్షి పత్రిక తప్పుడు ప్రచారం చేయడం దురదృష్టకరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. అవాస్తవాలతో రైతుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుకు మేలు జరిగితే ఓర్వలేని ధోరణితో వార్తలు రాయడం మానుకోవాలని హితవు పలికారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదనే లక్ష్యంతోనే ప్రభుత్వం పంటల బీమాపై ప్రత్యేక దృష్టి పెట్టిందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి రైతును ప్రత్యక్షంగా సంప్రదించడంతో పాటు రైతు సేవా కేంద్రం, క్లస్టర్, రైతువారీగా అర్హుల వివరాలను మ్యాపింగ్ చేశామని తెలిపారు. బీమా పరిధిలోకి రాని అర్హులైన రైతులను గుర్తించి జూలై 29 నుంచి 31 వరకు ప్రత్యేక పంటల బీమా నమోదు కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. ఇది సిబ్బందిపై ఒత్తిడి కాదని, అర్హులైన ప్రతి రైతుకూ బీమా రక్షణ కల్పించాలనే బాధ్యతాయుతమైన చర్య అని స్పష్టం చేశారు.

పంటల బీమా నమోదు పూర్తిగా రైతుల సమ్మతి, వారి ఇష్టప్రకారమే జరిగిందని, ఎవరినీ బలవంతంగా నమోదు చేయలేదని మంత్రి తేల్చిచెప్పారు. బీమా గడువు ముగిసిన తర్వాత నమోదు చేసుకునే అవకాశం ఉండదని, అందుకే పంట సాగుకు అవకాశం ఉన్న ప్రాంతాల్లోని రైతులకు ముందుగానే అవగాహన కల్పించి బీమా తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. బీమా చేసిన మొత్తంలో రైతు చెల్లించాల్సిన ప్రీమియం కేవలం 0 నుంచి 2 శాతం మాత్రమేనని, మిగిలిన ప్రీమియాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయని అచ్చెన్నాయుడు వివరించారు. కొన్ని జిల్లాల్లో ఎకరాకు రైతు చెల్లించాల్సిన ప్రీమియం చూస్తేనే ప్రభుత్వం రైతులపై ఎంత తక్కువ భారం పెడుతోందో అర్థమవుతుందన్నారు. వరి, కోనసీమ జిల్లాలో ?76, సజ్జ, కర్నూలు జిల్లాలో ?32, మినుము, కడప జిల్లాలో ?38, వేరుశనగ, నెల్లూరు జిల్లాలో ?280, జొన్న, కడప/కర్నూలు జిల్లాల్లో ?35, మొక్కజొన్న, కర్నూలు/శ్రీకాకుళం జిల్లాల్లో ?66, కంది, కడప జిల్లాలో ?36, ఉల్లి, కడప/కర్నూలు జిల్లాల్లో ?90, మిరప, కర్నూలు/పల్నాడు జిల్లాల్లో ?360 మాత్రమే రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. క్లస్టర్, జిల్లా, పంట, బీమా కంపెనీని బట్టి ప్రీమియంలో స్వల్ప వ్యత్యాసం ఉండవచ్చని పేర్కొన్నారు.

ఎల్‌నినో ప్రమాదం ఇప్పటికే స్పష్టంగా ఉండటంతో గడువుల పొడిగింపునకు బీమా కంపెనీలు తొలుత సుముఖత చూపకపోయినా, ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం, బీమా సంస్థలతో మాట్లాడి రైతుల ప్రయోజనాల కోసం గడువులను పొడిగించేలా కృషి చేశారని తెలిపారు. వాతావరణ ఆధారిత =ఔదీజ×ూ గడువును జూలై 15 నుంచి జూలై 31 వరకు, దిగుబడి ఆధారిత్రూవీఖీదీ గడువును జూలై 31 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగించామని చెప్పారు. అంతేకాకుండాౖవీఖీదీ నమోదును ఆగస్టు 31 వరకు మరింత పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించామని, నమోదు వివరాలను పూర్తిచేసేందుకు బ్యాంకులకు అదనంగా 15 రోజుల సమయం ఇచ్చినట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగానే ఖరీఫ్-2026లో పంటల బీమా నమోదు రికార్డు స్థాయికి చేరిందని మంత్రి తెలిపారు. ఖరీఫ్-2025లో 19.50 లక్షలుగా ఉన్న నమోదు దరఖాస్తులు ఖరీఫ్-2026లో 35.17 లక్షలకు పెరిగాయని, ఇది సుమారు 80 శాతం పెరుగుదల అని చెప్పారు. ముఖ్యంగా రుణాలు తీసుకోని రైతుల నమోదు 2.00 లక్షల నుంచి ఏకంగా 20.35 లక్షలకు పెరిగిందన్నారు. బీమా విస్తీర్ణం 7.83 లక్షల హెక్టార్ల నుంచి 15.17 లక్షల హెక్టార్లకు, అంటే సుమారు 94 శాతం పెరిగిందని వెల్లడించారు. మొత్తం ?13,983 కోట్ల బీమా మొత్తం నమోదైందని, బీమా విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 5వ స్థానంలో నిలిచిందని తెలిపారు.

రైతులకు పరిహారం అందడం లేదంటూ ఇప్పుడు విమర్శలు చేస్తున్న వారు గత ప్రభుత్వ హయాంలో చెల్లించాల్సిన సుమారు ?1,990 కోట్ల ప్రీమియం బకాయిలపై ముందుగా సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ బకాయిల కారణంగానే రైతులకు రావాల్సిన బీమా పరిహారం నిలిచిపోయిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల ఇబ్బందులను గుర్తించి గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా దశలవారీగా చెల్లించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అదే విధంగా ఖరీఫ్--2025కు సంబంధించిన ప్రభుత్వ ప్రీమియాన్ని చెల్లించడంతో రైతుల ఖాతాల్లో బీమా పరిహారం జమయ్యే ప్రక్రియ ప్రారంభమైందని వెల్లడించారు. ఎల్‌నినో నేపథ్యంలో ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదు. అత్యంత తక్కువ ప్రీమియంతో గరిష్ఠ బీమా రక్షణ కల్పించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. రైతులకు మేలు జరుగుతుంటే అభినందించాల్సింది పోయి వాస్తవాలను వక్రీకరించి అపోహలు సృష్టించడం రైతు వ్యతిరేక ధోరణి. సాక్షి ఎన్ని తప్పుడు కథనాలు రాసినా గణాంకాలు, వాస్తవాలే కూటమి ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతకు నిదర్శనం అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## గడప గడపకూ సంక్షేమ సందేశం

(మొదటి పేజీ తరువాయి)

60 లక్షల ఇళ్ల మైలురాయిని అధిగమించిన స్ఫూర్తితో కార్యక్రమాన్ని మరింత వేగంగా, విస్తృతంగా కొనసాగిస్తూ.. కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధి-సంక్షేమ ఫలాలను ప్రతి గడపకు చేర్చేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారు.

## సభా సమరం షురూ!

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ శాసనసభ్యులతో ఇటీవల సమావేశమైన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, ఈ మేరకు ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష గొంతు నొక్కేందుకే చంద్రబాబు ప్రభుత్వం తమకు ఎల్‌ఓపీ హోదా ఇవ్వడం లేదని ఆయన ఆరోపించారు.

మండలిలో పార్టీకి ఉన్న సంఖ్యాబలాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని జగన్ సూచించారు. మెగా డీఎస్సీ-2025పై చర్చించాలని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుమారుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రమేయంపై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్ చేయాలని పార్టీ సభ్యులకు సూచించారు.

దాదాపు 13 త్రైమాసికాలుగా పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 9,100 కోట్లు, వసతి దీవెన బకాయిలు రూ. 3,300 కోట్లను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ అంశాలను కూడా మండలిలో బలంగా ప్రస్తావించాలని జగన్ స్పష్టం చేశారు. దీంతో, అసెంబ్లీలో చర్చ ప్రశాంతంగా సాగినా, శాసనమండలిలో మాత్రం అధికార, విపక్షాల మధ్య వాడివేడి వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి.

## భోగాపురం 'టేకాఫ్'

(మొదటి పేజీ తరువాయి)

ఉదయం 8 గంటలకు మరో ఎయిరిండియా సర్వీసు బెంగళూరుకు బయల్దేరనుంది.

ఇప్పటికే భోగాపురం నుంచి హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, తిరుపతికి ఇండిగో సంస్థ తొలి రోజు 31 సర్వీసులు నడపడానికి ప్రణాళిక రూపొందించింది. భోగాపురంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలపై విమానయాన సంస్థలు ఒక్కొక్కటిగా తమ షెడ్యూళ్లను విడుదల చేస్తున్నాయి. ఈ నెల 16 (ఆదివారం) అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానుండగా.. అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి వెళ్లనున్నాయి.

## సీజేను కలిసిన న్యాయాధికారులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాష్ట్రంలోని న్యాయధికారుల పనితీరు, విధి నిర్వహణ పరిస్థితులు, న్యాయ సేవల సమర్థతపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ సానుకూలంగా చర్చించినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ప్రధాన న్యాయమూర్తిని కలిసిన వారిలో జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, రమేష్ నాయుడు, శైలజ కంపల్లి, శ్రీనివాసరావు, బెజవాడ రాధారాణి, వెన్నెల, వెంకట శేషాద్రితో పాటు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## ముగిసిన టెట్-2026

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2026 ముగిసింది. ఈ నెల 5 నుంచి ఆదివారం జరిగిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని టెట్ కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చివరి రోజైన ఆదివారం మొదటి సెషన్‌లో నిర్వహించిన పేపర్-2ఎ మ్యాథ్స్, సైన్స్‌ను 61 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించామని తెలిపారు. రెండో సెషన్‌లో నిర్వహించిన పేపర్-2ఎ లాంగ్వేజ్(ఇంగ్లీష్)ను 65 కేంద్రాల్లో జరిగాయని పేర్కొన్నారు. మొత్తంగా 11 రోజుల పాటు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లో 103 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించామని తెలిపారు. మొత్తం 2,38,252 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 2,18,254 మంది అభ్యర్థులు (91.61శాతం) హాజరయ్యారని వెల్లడించారు.


## ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనాలు

(మొదటి పేజీ తరువాయి)

2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల కాలానికి గౌరవ వేతనాలు చెల్లించేందుకు ఈ నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంపై ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ నిధుల మంజూరు నిదర్శనమని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఇమామ్‌లు, మౌజన్లకు క్రమం తప్పకుండా గౌరవ వేతనాలు అందేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రులు నారా లోకేష్, ఎన్.ఎం.డి. ఫరూక్ సహకారంతో మైనారిటీల సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయని అబ్దుల్ అజీజ్ తెలిపారు. రాష్ట్రంలోని ఇమామ్‌లకు నెలకు రూ. 10 వేలు, మౌజన్లకు రూ. 5 వేల చొప్పున గౌరవ వేతనం అందుతుందని, మూడు నెలలకు ఒక్కో ఇమామ్‌కు రూ. 30 వేలు, ఒక్కో మౌజన్‌కు రూ. 15 వేలు చొప్పున అందనున్నాయని పేర్కొన్నారు. మంజూరైన రూ. 22.50 కోట్లను ఏపీ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈవోకు విడుదల చేయాలని మైనారిటీ సంక్షేమ శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించిందని అబ్దుల్ అజీజ్ తెలిపారు. విడుదలైన నిధులను త్వరితగతిన ఇమామ్, మౌజన్‌లకు అందిస్తామని తెలిపారు.

## రుషికొండలో వెస్టిన్-లైకా బీచ్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

- విశాఖను ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలోని రుషికొండలో వెస్టిన్ హోటల్--లైకా బీచ్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, ప్రపంచస్థాయి ఆతిథ్య సదుపాయాలతో విశాఖపట్నాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పర్యాటక రంగంతో పాటు స్థానిక ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని పేర్కొన్నారు.

లైకా గ్రూప్ చైర్మన్ గోకరాజు గంగరాజు, లైకా గ్రూప్ ప్రతినిధులను అభినందిస్తూ, విశాఖలో భారీ పెట్టుబడులతో ముందుకు రావడం రాష్ట్ర అభివృద్ధికి శుభపరిణామమని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## డ్రోన్ల విధ్వంసం.. రష్యా విలవిల

(మొదటి పేజీ తరువాయి)

వందలాది డ్రోన్‌లతో ఆదివారం రాత్రి విరుచుకుపడింది. ఈ దాడులలో కనీసం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఉక్రెయిన్ జరిపిన అతి పెద్ద డ్రోన్ దాడి ఇదేనని రష్యా ప్రభుత్వం తెలియజేసింది. ఉక్రెయిన్ ప్రయోగించిన 800 డ్రోన్లను కూల్చివేశామని మాస్కో గవర్నర్ ఆండ్రే ఓరోబియేవ్ చెప్పారు. మాస్కో ప్రాంతం పైకి దూసుకొచ్చిన 187 డ్రోన్లను గగనతల రక్షణ దళాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ యూనిట్లు తటస్థం చేశాయని ఆయన తెలిపారు. రాజధాని మాస్కోలో సంపన్నులు అధికంగా నివసించే ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ డ్రోన్ దాడి జరిపింది. మాస్కో ప్రాంతంలో ఆదివారం జరిగిన డ్రోన్ దాడిలో 83 సంవత్సరాల వృద్ధుడు చనిపోయాడు.

ఉక్రెయిన్ దాడుల కారణంగా మాస్కో ప్రాంతంలోని అతి పెద్ద వైల్డ్‌బెర్రీస్ గిడ్డంగుల వద్ద భారీగా మంటలు వ్యాపించాయి. ఆకాశంలో దట్టమైన పొగలు అలముకున్నాయి. ఎలక్ట్రోస్టాల్, కొలెడినో ప్రాంతాలలోని గిడ్డంగులు మంటలలో కాలిపోయాయి. దాచుకున్న సరుకు బూడిదైపోవడంతో వ్యాపారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారు. ఆన్‌లైన్ వ్యాపారులు సరఫరాలను నిలిపివేశారు. ఇటీవలి కాలంలో వైల్డ్‌బెర్రీస్ గిడ్డంగులను ఉక్రెయిన్ సేనలు లక్ష్యంగా చేసుకొని పదే పదే దాడులు జరిపాయి. దీంతో పొరుగున ఉన్న కజకిస్థాన్‌లో కొత్త గిడ్డంగిని నిర్మించామని కంపెనీ కొద్ది కాలం క్రితమే ప్రకటించింది. ఉక్రెయిన్ నుంచి 17 ప్రాంతాల వైపు... ముఖ్యంగా దక్షిణ, పశ్చిమ ప్రాంతాల వైపు వచ్చిన డ్రోన్లను అడ్డుకున్నామని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దాడుల కారణంగా దక్షిణ రష్యాలోని రోస్తొవ్‌లో ఐదుగురు మరణించారు.

**కీవ్‌పై రష్యా ప్రతి దాడులు :** రష్యా కూడా ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై డ్రోన్, క్షిపణి దాడులు జరిపింది. ఆదివారం ఉదయం జరిగిన దాడులలో ఆరుగురు గాయపడ్డారు. సెంట్రల్ ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాలపై బాలిస్టిక్ క్షిపణి దాడులు జరగగా ముగ్గురు చనిపోయారు. రష్యా ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను ఉక్రెయిన్ కూల్చలేకపోయింది. బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకునే వ్యవస్థల కొరతే దీనికి కారణంగా తెలుస్తోంది.

## భవితకు భరోసా.. ప్రసంగాల్లో ప్రగతి దిశ

(మొదటి పేజీ తరువాయి)

**జగన్‌రెడ్డి వైఖరి మారాలి :** తన పార్టీ సీనియర్ నాయకుల నేర, అక్రమ చర్యలకు బాధితులైనవారిని పట్టించుకోకుండా తప్పులు చేసిన వారిని పరామర్శించడంలో నిత్యం బిజీగా ఉంటున్న జగన్‌రెడ్డి మధ్య మధ్యలో వీలు చూసుకొని రాష్ట్ర అభివృద్ధి పనులను కూడా సందర్శిస్తే వాస్తవాలు తెలుస్తాయని మంత్రి హితవు పలికారు. పూర్తికావడానికి సిద్ధంగా ఉన్న పోలవరం, శరవేగంతో దూసుకుపోతున్న రాజధాని అమరావతి పునర్నిర్మాణం, వెల్లువలా రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, భోగాపురం నుంచి గగనతలంలోకి ఎగురనున్న విమానాలు, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో రూపుదిద్దుకుంటున్న ఎకనమిక్ రీజియన్లు వంటి పలు అభివృద్ధి పనులు, పెద్ద ఎత్తున అమలవుతున్న సంక్షేమ పథకాలతో రాజకీయ కక్ష, ఈర్ష్యలతో జగన్‌రెడ్డి కనుచూపు, మనసు మందగించాయని మంత్రి అన్నారు. ఈ వైకల్యాలతో అణువంత అవినీతిలేని డీఎస్సీపై పెద్దఎత్తున దుష్ప్రచారానికి జగన్‌రెడ్డి దిగజారారని మంత్రి ధ్వజమెత్తారు.

**లెక్కలతో అసెంబ్లీకి డుమ్మా :** తనను మరోసారి ముఖ్యమంత్రిని చేయమని అభ్యర్థిస్తే.. 'చేసింది చాలు, ప్రతిపక్ష నాయకుని అర్హత కూడా లేదు' అంటూ ప్రజలు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తే, నియమాలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ జగన్‌రెడ్డి అసెంబ్లీకి రావడంలేదని మంత్రి దుయ్యబట్టారు. బహుశా.. కనీసం ప్రతిపక్ష నాయకుని హోదా కల్పించమని వేడుకుంటే ప్రజలు కొంతమేర కనికరించేవారేమోనని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఎద్దేవా చేశారు.

**జగన్‌రెడ్డి మైండ్ బ్లాంక్ :** 16,000 మంది ఉపాధ్యాయుల నియామకానికి కారణమైన డీఎస్సీపై విష ప్రచారానికి కంకణం కట్టుకున్న జగన్‌రెడ్డికి తన హయాంలో జరిగిన గ్రూప్-1 కుంభకోణం వెల్లడవడంతో మైండ్ బ్లాంక్ అయ్యిందని, దమ్ముంటే సోమవారం నుంచి జరుగనున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరై తన వాదన వినిపించాలని మంత్రి డిమాండ్ చేశారు. అలా కాకుండా.. పత్రికా సమావేశాల ద్వారా తన వాణిని వినిపిస్తాననడం జగన్ పలాయనవాదానికి, అప్రజాస్వామిక ధోరణికి నిదర్శనమని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఘాటుగా విమర్శించారు.

**స్ఫూర్తిదాయక ప్రసంగాలు :** ప్రధాని ఎర్రకోట ప్రసంగం 2047 నాటికి 'వికసిత భారత్' నిర్మాణ దిశగా ప్రజల్లో భరోసా నింపిందని, 'సప్తధార' సంకల్పంతో రానున్న 20 సంవత్సరాలు కృషి చేసే దిశగా దేశ ప్రజల్లో చైతన్యాన్ని నింపిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. గత 12 ఏళ్ల కృషితో సాధించిన సత్ఫలితాల ఆధారంగా ప్రజల్లో విశ్వాసాన్ని పెంచే విధంగా ప్రధాని ప్రసంగం సాగిందని మంత్రి అన్నారు.

మొదటిసారిగా అమరావతిలో జరిగిన స్వాతంత్రోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగం అదే రీతిన రాష్ట్ర ప్రజల్లో భవిత పట్ల నమ్మకాన్ని కలిగించిందని మంత్రి అన్నారు. 'చేతిలో జెండా-మదిలో ఎజెండా' ఇతివృత్తంగా ముఖ్యమంత్రి ప్రసంగం ప్రేరణాత్మకంగా ఉందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## దేశం మెచ్చిన ఏపీ ఏఐ ఏజెంట్

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతికతతో పన్నుల వసూళ్లలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. సాధారణంగా ఆరు నుంచి ఎనిమిది వారాలు పట్టే పని ఇప్పుడు కేవలం రెండు, మూడు గంటల్లోనే పూర్తవుతోంది. ఈ సరికొత్త విధానంతో ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని సైతం విశేషంగా ఆకర్షించింది. ఏఐ సాయంతో డేటా విశ్లేషణ, పన్నుల రిటర్న్‌ల పరిశీలన, ఆడిట్, తనిఖీలు సులభంగా మారుతున్నాయి.

ఏపీ ప్రవేశపెట్టిన ఏఐ ఆధారిత పన్నుల వసూళ్ల వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు కేంద్ర జీఎస్టీ కౌన్సిల్ అదనపు కార్యదర్శి పంకజ్‌కుమార్ సింగ్, సంయుక్త కార్యదర్శి డి.పి. మిశ్రా నేతృత్వంలోని బృందం ఇటీవల రాష్ట్రానికి వచ్చింది. రెండు రోజుల పాటు ఈ వ్యవస్థ పనితీరును వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్ర స్థాయిలోనూ దీన్ని అమలు చేసేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కేంద్ర బృందం నిత్యం సంప్రదింపులు జరుపుతోంది.

కృత్రిమ మేధకు, మానవ మేధను ముడివేసి ప్రతి నెలా రూ. 600-750 కోట్ల మేర రాబడి పెంచగలిగినట్లు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు తెలిపారు. ఈ వ్యవస్థకు సంబంధించి ఆయన పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

ఏపీ వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేకంగా జీఎస్టీ చట్టాలకు, ఈ శాఖ కార్యకలాపాలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? ఏజెంట్‌ను తయారు చేసుకుంది. కేంద్ర ప్రభుత్వ మేఘనాథ్ విధానంలో భాగంగా ఈ సమాచారం ఎక్కడా బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. రాష్ట్ర జీఎస్టీ, కేంద్ర జీఎస్టీ చట్టం కింద ఉన్న ప్రొసీజర్‌లు, షోకాజ్ నోటీసులు, సమాధానాలు తీసుకోవడం వంటివి మొత్తం 12- 13 దశలు ఉన్నాయి. ఇవన్నీ కృత్రిమ మేధ ప్రాసెస్‌తో అనుసంధానం చేశాం.

లీగల్ ఏఐ ఏజెంట్‌ను తయారు చేసుకున్నాం. ఇప్పుడు రాష్ట్ర హైకోర్టు జీఎస్టీ అప్పిలేట్ అథారిటీ వంటి చోట పనులు సులభమయ్యాయి. ఒక కేసును విశ్లేషించి సూత్రీకరించే పని సులువుగా మారింది. ఓ పద్ధతి ప్రకారం డాక్యుమెంటేషన్ కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేస్తోంది. కోర్టుల్లో కేసు సమర్పణ చాలా సులువైంది.

ఏపీలో ఐదు లక్షల మంది పన్ను చెల్లింపుదారులున్నారు. మా ప్రత్యేక ఏఐ వ్యవస్థతో 25,000ల మంది పన్ను చెల్లించాల్సిన వారిని కొత్తగా గుర్తించాం. ప్రతినెలా వీరు ఫైల్ చేసే రిటర్న్?లను ఇప్పుడు కొద్ది గంటల్లోనే పరిశీలించి తప్పొప్పులు గుర్తించి, సరైన పన్ను వసూలు చేయగలుగుతున్నాం.

ఏపీలో ప్రభుత్వ ఆధ్వర్యంలో అనేక ప్రాజెక్టుల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అమరావతి, పోలవరం, నేషనల్ హైవేస్?, రైల్వేలకు సంబంధించి మొత్తం 140 ప్రాజెక్టులను గుర్తించి ట్రాక్ చేస్తున్నాం. వారికి చెల్లించే బిల్లు మొత్తాల ఆధారంగా రాష్ట్రానికి రావాల్సిన రాబడిని ట్రాక్ చేస్తున్నాం.

ఒక అధికారి డాక్యుమెంటేషన్, విశ్లేషణకు సమయం కేటాయిస్తే ఎక్కువ పనులు చేయలేరు. ఆ రెండూ కృత్రిమ మేధ సాయంతో చేసి మానవ మేధస్సును అవసరమైన చోట ఉపయోగిస్తే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ పాలన సులభమవుతుంది. అన్ని ప్రభుత్వ శాఖలూ ఇలా ఏఐ ఏజెంట్‌ను సిద్ధం చేసుకోవచ్చు.

## బీసీల అభ్యున్నతే లక్ష్యం



(మొదటి పేజీ తరువాయి)

గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించేలా గతేడాది జీవో జారీ చేశామన్నారు. గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తి, ప్రజా సేవ, దేశభక్తి నేటి తరం యువతకు ఎంతో ఆదర్శమన్నారు. దేశానికి, వెనుబడిన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన సేవలు భావితరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. మద్యం షాపుల్లో గీత కార్మికులకు పది శాతం రిజర్వేషన్లు కల్పించి వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అత్యధికంగా లబ్ధి పొందుతున్నది బీసీలేనని మంత్రి సవిత తెలిపారు.

**గతంలో బీసీలను ఇబ్బందులకు గురిచేశారు : మంత్రి అనగాని :** బీసీల హక్కుల కోసం, వారి అభ్యున్నతి కోసం గౌతు లచ్చన్న ఎన్నో ఉద్యమాలు చేశారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రైతుల కోసం మొట్టమొదటిసారి పాదయాత్ర చేసిన ఘనత కూడా ఆయనదేనన్నారు. శ్రీకాకుళం నుంచి చెన్నై వరకూ 1600ల కిలో మీటర్ల పాదయాత్ర చేశారన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో లచ్చన్న పోరాటం ఆనాటి ఆంగ్లేయులకు కంటి మీద కునుకు లేకుండా చేసిందన్నారు. చివరికి ఆయనను కనిపిస్తే కాల్చివేతకు ఆదేశాలిచ్చిందన్నారు. దేశానికి స్వాతంత్ర్య వచ్చిన తరవాత బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశారన్నారు. గతంలో ఎందరో బీసీలు హత్యలకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే, బీసీలను అక్కున చేర్చుకున్నారు. బీసీలు విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోగలరని సీఎం చంద్రబాబు నమ్మకమన్నారు. అందుకనే, బీసీల విద్యకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

**బీసీలను వేధించిన గత ప్రభుత్వ నేతలు: కొల్లు రవీంద్ర :** గౌతు లచ్చన్న స్ఫూర్తితో సీఎం చంద్రబాబు నాయుడు అన్నింటా బీసీలకు పెద్ద పీట వేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాతినిథ్యం పెంచేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. బీసీల పతనాన్ని ఆ పార్టీ నేతలు కోరుకున్నారన్నారు. తప్పుడు కేసులు పెట్టి, తనతో సహా ఎందరో బీసీలను జైల్లో పెట్టారన్నారు. తనపై హత్య కేసు సైతం బనాయించారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబునాయుడు అన్నింటా బీసీలకు అండగా నిలుస్తున్నారన్నారు. బీసీల సంక్షేమం కోరుతూ ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా బీసీ యువతకు అండగా నిలుస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు.

**బీసీలు ఐక్యంగా ఉండాలి : మంత్రి పార్థసారథి:** బీసీలు ఐక్యంగా ఉండాల్సిన అవశ్యకత ఎంతో ఉందని మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. బీసీల ఐక్యతను దెబ్బతీయడానికి కుట్ర పన్నుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని అన్నారు. బీసీల పేరుతో కొందరు వైసీపీ నాయకులు నేరాలకు పాల్పడుతున్నారన్నారు.

తప్పులు చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు. బీసీ యువత తమ హక్కుల సాధనకు పోరాటాలు చేయక తప్పదన్నారు. బీసీల అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కేవలం పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు అందజేసి బీసీలను నిర్లక్ష్యం చేయకూడదని, వారిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలనేదే ఆయన సిద్ధాంతమని తెలిపారు.

ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ..లిలిలి సర్దార్ గౌతు లచ్చన్న కుటుంబాన్ని జగన్ అవమానానికి, వేధింపులకు గురి చేశాడని మండిపడ్డారు. తన తాత విలువలతో కూడిన రాజకీయాలు చేశారన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించారన్నారు. నేడు జగన్ ప్రతిపక్ష హోదా ఇవ్వాలని కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా అనేది ఎవరో ఇచ్చే డిగ్రీ పట్టా కాదని, ప్రజలు మాత్రమే ఇచ్చేదాని విమర్శించారు.

**125 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు :** అనగాని సత్యప్రసాద్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గౌడ సామాజిక వర్గానికి చెందిన 125 మంది విద్యార్థులకు రూ. 25 లక్షల నగదును పురస్కారాల రూపంలో అందజేశారు. టెన్త్, ఇంటర్ లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ నగదు పురస్కారాలు మంత్రులు సవిత, అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు అందజేశారు.

కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, కుమార వర్మ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, బీసీ సంక్షేమ శాఖాధికారులు, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి గురుమూర్తి, కె.సత్తిబాబు, పేరెపి ఈశ్వర్, వై.రమణ, డైరెక్టర్లు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, గౌడ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంఎస్ఎస్ భవన్‌లో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు



మంగళగిరి టౌన్(జర్నలిస్ట్ ఫైల్): మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం డా. ఎంఎస్ఎస్ భవన్‌లో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమాన్ని మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్న చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు గౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ గౌతు లచ్చన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రజా నాయకుడిగా, సామాజిక సంస్కర్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

వెనుకబడిన తరగతుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన లచ్చన్న, బీసీలలో రాజకీయ చైతన్యం తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. పేదలు, కార్మికులు, కర్షకులు, బడుగు వర్గాల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగిస్తూ బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని వాకా మాధవరావు గౌడ్ పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే లచ్చన్నకు నిజమైన నివాళి అని అన్నారు.

ఈ కార్యక్రమం లో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు దామర్ల రాజు,పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ఆకురాతి నాగేంద్రం, కారంపూడి అంకమ్మరావు,గోవాడ దుర్గారావు,షేక్ హుస్సేన్,వంగర హనుమాన్,షేక్ సుభాని,చాగంటి పాటి పూర్ణచంద్రరరావు,మాదల రమేష్,జొన్నాదుల బాలకృష్ణ,జూపల్లి వెంకటేశ్వరరావు,తాత కోటయ్య,కోసూరు రాజా,జంజనం వెంకట సుబ్బారావు, జొన్నదుల రామాఆంజనేయులు, అబ్దుల్లా ఖాన్,కంచర్ల రంగారావు, వంగర లక్ష్మయ్య,జగ్గారపు రాము,పి. రామకృష్ణ, చెరకు పూర్ణ, పంది దుర్గారావు, ఆకురాతి లక్ష్మణ్,బిట్ర రాధాకృష్ణ మూర్తి, ఆలూరి తులసిరామ్, ఉద్దంటి గాంధీ, గంజి లక్ష్మయ్య, కాటూరి రవి, ఏలి నాగేశ్వరావు, కుర్నేళ్ల పూర్ణ, ఆకురాతి లక్ష్మణ్, బిట్ర కోటేశ్వరరావు, కలవకొల్లు వీర రాఘవులు, కారంపూడి చిరంజీవి, మునగపాటి ప్రసన్న వెంకటేశ్వరరావు, బుల్లా శంకర్, నక్క రాజశేఖర్, తేలు వెంకటేశ్వరరావు,సైనాధం శ్రీనివాసరావు,కట్టేపోగు ఉదయ భాస్కర్, అడిగొప్పుల శ్రీను, మేక గోపి తదితరులు పాల్గొన్నారు.

# చికెన్ పకోడీ వివాదంతో అన్నను నరికిన చంపిన తమ్ముడు

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రమైన తెలుగు గంగ ప్రాజెక్ట్ వెళ్లే దారిలో వున్న రజక అన్నదాన సత్రానికి సమీపంలో నివాసం ఉంటున్న వజ్రాల సుబ్బారాయుడు హైమావతి లకు ఇద్దరు కుమారులలో పెద్ద కుమారుడు వజ్రాల వెంకటసుబ్బయ్య చిన్న కుమారుడు సురేష్ ఆదివారం మంచం పైన నిద్రిస్తుండగా వెంకట సుబ్బయ్య (45 )ను అతి కిరాతకంగా గొడ్డలి తో నరకి చంపాడు. వివరాల్లోకెళితే వీరిద్దరూ మద్యానికి బానిసై కావడం తో వాళ్ళను భార్యలు వదిలేసి పుట్టింటికి వెళ్లిపోయారు. అప్పటి నుండి వారు తల్లి హైమావతి వద్దనే ఉంటున్నారు. శనివారం రాత్రి తమ్ముడు సురేష్ చికెన్ పకోడీ తెచ్చుకోగా అన్న వెంకట సుబ్బయ్య శనివారం కద ఎందుకు తెచ్చుకున్నావని అనడంతో ఇద్దరి మధ్య జరిగిన గొడవను మనసు పెట్టుకొని ఆదివారం అన్న వెంటసుబ్బయ్యను తమ్ముడు సురేష్ గొడ్డలి తో నరికి చంపాడు. విషయం తెలుసుకున్న మైదుకూరు డి ఎస్ పి రాజేంద్ర ప్రసాద్, రూరల్ ఇన్స్పెక్టర్ శివ శంకర్,సబ్ ఇన్స్పెక్టర్ శివ ప్రసాద్ పోలీస్ లు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డి ఎస్ పి మాట్లాడుతూ కేసు నమోదు చేసి హత్యకు సంబంధించిన దర్యాప్తు చేపడతామన్నారు.

# నేడు జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి 323వ జయంతి మహోత్సవాలు



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి మఠంలో ఈనెల 17 న సోమవారం శ్రావణ శుద్ధ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని పరమేశ్వరి స్వరూపిణి శ్రీశ్రీ ఈశ్వరీ మహాదేవి త్రయోవింశత్యుత్తర త్రిశతితమ (323)వ జయంతి మహోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఈశ్వరీ దేవి మఠం కార్యనిర్వహణాధికారి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. శ్రీ ఈశ్వరి దేవి మఠం మఠాధిపతి శ్రీ వీర శివకుమారస్వాములవారి ఆధ్వర్యంలో జరిగే ఈ జయంతి మహోత్సవాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు సుప్రభాత సేవ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని మఠంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుందని, భక్తులందరూ కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని జగన్మోహన్‌రెడ్డి కోరారు.

# ప్రాథమిక పాఠశాలల్లో అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



బ్రహ్మంగారి మఠం(జర్నలిస్ట్ ఫైల్): బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల యందు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయుటకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బ్రహ్మంగారిమఠం మండల విద్యాశాఖ అధికారి ఎం పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠం మండలంలోని ప్రాథమిక పాఠశాలల యందు 14 అకడమిక్ ఇన్ స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఎంఈఓ తెలిపారు. టిటిసి లేక డి.ఎడ్ మరియు టెట్ అర్హతగా కలిగినటువంటి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారికి ఈనెల అనగా 16వ తేదీ నుండి 21 వ తేదీ వరకు సమయం ఉందని అభ్యర్థులు ప్రతి ఒక్కరు బ్రహ్మంగారిమఠంలోని ఎం ఆర్ సి కి వారి దరఖాస్తులు అందజేయాలని ఆయన తెలిపారు. ఈ పోస్టులకు గౌరవ వేతనం కింద నెలకు పదివేల రూపాయలు(10000) ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన తెలిపారు. కాబట్టి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకోవాలని ఆయన నిరుద్యోగులను కోరారు

# బడుగుల బాంధవుడు గౌతు లచ్చన్న స్ఫూర్తి చిరస్మరణీయం

- **తెనాలిలో సర్దార్ గౌతు లచ్చన్న కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు అచ్చెన్నాయుడు, మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి**







**తెనాలి, ఆగస్టు 16(జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా తెనాలి ట్యాంక్ బండ్ వద్ద తెనాలి పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటంతో పాటు బడుగు, బలహీన వర్గాలు, బీసీలు, రైతులు, కార్మికుల హక్కుల కోసం జీవితాంతం ఉద్యమించిన మహనీయుడు సర్దార్ గౌతు లచ్చన్న అని కొనియాడారు. ఉత్తరాంధ్ర ముద్దుబిడ్డగా జన్మించి రాష్ట్రవ్యాప్తంగా బడుగు వర్గాల గొంతుకగా ఎదిగిన లచ్చన్న జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, బీసీల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి, సాగించిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, తెనాలి నడిబొడ్డున గౌతు లచ్చన్న కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమని, ఇందుకు కృషి చేసిన తెనాలి పట్టణ గౌడ సంఘం ప్రతినిధులను మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు. ఇటువంటి మహనీయుల విగ్రహాలు భావితరాలకు వారి త్యాగాలను, పోరాటాలను నిరంతరం గుర్తుచేస్తాయని పేర్కొన్నారు. గౌతు లచ్చన్న ఆశయాలను కొనసాగిస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే గౌతు శిరీష, చైర్మన్ హెన్రీ క్రిస్టినా, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కూటమి నాయకులు, బీసీ సంఘాల నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విశాఖకు నితిన్ నబీన్ రాక..

- **17న భోగాపురం విమానాశ్రయంలో ఘన స్వాగతం**
- **18న 945 మండలాల ప్రతినిధులతో విస్తృత సమావేశం**



**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నితిన్ నబీన్ తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు రానున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ఆగస్టు 17న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం అనంతరం రాత్రి 9 గంటలకు ఆయన విశాఖపట్నం చేరుకోనున్నట్లు వెల్లడించారు.

విశాఖలోని డాల్ఫిన్ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షుడికి భోగాపురం విమానాశ్రయంలో సాంప్రదాయ స్వాగతం పలికేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివస్తాయని తెలిపారు.

**18న రాష్ట్ర కార్యవర్గ సమావేశం**

కొత్త రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటైన నేపథ్యంలో ఆగస్టు 18న విశాఖలోని వి-కన్వెన్షన్ హాల్‌లో విస్తృత స్థాయి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు మాధవ్ వెల్లడించారు. రాష్ట్రంలోని 945 మండలాలకు చెందిన మండల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, రాష్ట్ర పదాధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరవుతారని చెప్పారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, జిల్లాలవారీ ప్రగతి, ఏడు మోర్చాల కార్యకలాపాలను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శనను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

**రాష్ట్ర అభివృద్ధిపై కీలక తీర్మానాలు :** సమావేశంలో రెండు ప్రధాన తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు మాధవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రానికి లభించిన పెట్టుబడులు, అభివృద్ధి కార్యక్రమాలపై ఒక తీర్మానం, పోలవరం ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి సహా సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని కోరుతూ మరో తీర్మానం ఆమోదించనున్నట్లు చెప్పారు.

బీజేపీ అఖిల భారత సంఘటన మంత్రి బీఎల్ సంతోష్, రాష్ట్ర ఇన్‌చార్జి శివప్రకాశ్ సహా పలువురు జాతీయ నాయకులు సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

**పోలవరం, ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు :** పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మాధవ్ పేర్కొన్నారు. త్వరలో గోదావరి జలాలు అనకాపల్లి జిల్లాకు చేరుతాయని, అనంతరం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తొలి, రెండో దశల ద్వారా మూడు జిల్లాలకు సాగు, తాగునీటి భద్రత కల్పించనున్నట్లు వివరించారు. 24.33 టీఎంసీల తాగునీటి లభ్యత ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకమని చెప్పారు.

**విశాఖకు కొత్త ఊపు :** విశాఖలో గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులు, డేటా కేబుల్ ప్రాజెక్టులు, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు, కొత్త రైల్వే లైన్లు, స్టేషన్ల అభివృద్ధితో నగర ప్రాధాన్యం మరింత పెరుగుతోందని మాధవ్ తెలిపారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆర్సెలార్ మిట్టల్, నిప్పాన్ స్టీల్, ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ. 1.84 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులు, బల్క్ డ్రగ్ పార్క్ వంటి ప్రాజెక్టులతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయని అన్నారు.

**యువతతో నితిన్ నబీన్ ముఖాముఖి :** ఆగస్టు 18న సాయంత్రం 4 గంటలకు విశాఖలోని గ్రాండ్ బే హోటల్‌లో 25 ఏళ్లలోపు 250 మంది ఎంపిక చేసిన యువతతో నితిన్ నబీన్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాధవ్ వెల్లడించారు. యువ న్యాయవాదులు, వైద్యులు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు ఇందులో పాల్గొంటారని తెలిపారు.

**స్థానిక ఎన్నికలకు కూటమి సిద్ధం**

చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సమన్వయంతో ముందుకు సాగుతోందని మాధవ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమిగా కలిసి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతోందని, దశలవారీగా స్థానిక ఎన్నికల నిర్వహణపై చర్చ జరుగుతోందని చెప్పారు.

విలేకరుల సమావేశంలో బీజేపీ శాసనసభ పక్ష నేత పెన్మెత్స విష్ణుకుమార్ రాజు, ఎమ్మెల్యే నడుకుడి ఈశ్వరరావు, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారి దిలీప్, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, కె. నరసింగరావు, గాదె శ్రీనివాసరావు, బొత్స సురేష్, వెన్నా శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల కోసం వారాంతాల్లో అల్పాహార వితరణ



- **ప్రతి శని ఆదివారం సాయంత్రం భక్తులకి అందుబాటులో అల్పాహారం**
- **లాంఛనంగా ప్రారంభించిన మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు**

బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ప్రాంగణంలోని అన్నదాన సత్రంలో ప్రతిరోజూ మధ్యాహ్నం భక్తులకు రుచికరమైన అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారి ఆదేశాల మేరకు శ్రావణమాసం సందర్భంగా ప్రతి శని ఆదివారాల్లో సాయంత్రం భక్తులు అధిక సంఖ్యలో మఠానికి తరలివస్తున్న నేపథ్యంలో వారికి అల్పాహారం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఈ సందర్భంగా అన్నదాన సత్రంలో ఉప్మా అల్పాహార వితరణ కార్యక్రమాన్ని మఠాధిపతి శ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారు స్వయంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

భక్తులకు ఆధ్యాత్మిక సేవలతో పాటు అన్నదానం అల్పాహారం అందించడం ద్వారా మఠం సేవా కార్యక్రమాలను మరింత విస్తరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతి సోదరుడు దత్తాత్రేయ పాల్గొన్నారు.

# చిరంజీవి సేవ లక్షల మందికి స్ఫూర్తి: మంత్రి దుర్గేష్



- **రాజమహేంద్రవరంలో మెగా రక్తదాన శిబిరం ప్రారంభం**
- **రక్తదాతలకు ప్రశంసాపత్రాల ప్రదానం**

**రాజమహేంద్రవరం(జర్నలిస్ట్ ఫైల్):** మెగాస్టార్ చిరంజీవి కేవలం సినీ హీరోగానే కాకుండా సమాజ సేవకుడిగా లక్షలాది మందికి స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత వ్యక్తి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన భారీ స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.

ఎ.వి. అప్పారావు రోడ్డులోని జనసేన నగర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేక్ కట్ చేసి అభిమానులు, పార్టీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, స్వచ్ఛందంగా రక్తదానం చేసిన దాతలను అభినందించారు. రక్తదాతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

**రక్తదానం ప్రాణదానం :** ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, "రక్తదానం చేయండి - ప్రాణదాతలు కండి" అనే చిరంజీవి సందేశాన్ని ఆయన అభిమానులు ఎన్నో ఏళ్లుగా ఆచరణలో చూపిస్తున్నారని కొనియాడారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేక ఏ ఒక్క ప్రాణం కోల్పోకూడదనే లక్ష్యంతో నిర్వహించే ఇటువంటి శిబిరాలు అనేక కుటుంబాలకు ఆశాజ్యోతిగా నిలుస్తాయని చెప్పారు.

ఒకే వ్యక్తి పదోసారి, పదమూడోసారి రక్తదానం చేయడం సమాజ సేవ పట్ల వారి నిబద్ధతకు నిదర్శనమన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసే ప్రతి ఒక్కరూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

**పవన్ కళ్యాణ్ అంకితభావం అభినందనీయం**

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర జ్వరంతో బాధపడుతూ వైద్యులు విశ్రాంతి సూచించినప్పటికీ, హస్తకళాకారులకు ఇచ్చిన హామీ మేరకు వుడ్ క్రాఫ్ట్ బ్యాంకులను ప్రారంభించడం, స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆయన ప్రజా సంక్షేమం పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనమని మంత్రి దుర్గేష్ అన్నారు.

పవన్ కళ్యాణ్ పార్టీ శ్రేణులకు మొదటి నుంచే క్రమశిక్షణ, సంస్కారం, బాధ్యతాయుతమైన రాజకీయాలపై స్పష్టమైన మార్గదర్శకత్వం ఇచ్చారని చెప్పారు. రాజకీయాల్లో వ్యక్తిగత దూషణలకు తావులేకుండా సద్విమర్శలకే ప్రాధాన్యత ఇవ్వాలన్న పవన్ కళ్యాణ్ సూచనలను జనసేన నాయకులంతా తూచా తప్పకుండా పాటిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఉండమట్ల రామ్, నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, టూరిజం డైరెక్టర్ గంటా స్వరూపతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## నెట్టెంపాడు 99, 100 ప్యాకేజీ పనులు పూర్తి చేయాలి

### - కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే, రైతులు



**గద్వాల, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని 99, 100 ప్యాకేజీల పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు నేతృత్వంలో రైతులు శనివారం గద్వాల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పనులు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే విజయుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యపై త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నెట్టెంపాడు ప్యాకేజీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే, రైతులు కోరారు.

## డెలివరీ అయిన ప్రతి మహిళకు గిఫ్ట్ కిట్ పంపిణీ




**గద్వాల, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** ధరూర్ మండల కేంద్రంలో డెలివరీ అయిన ప్రతి మహిళకు రూ.2,500 విలువైన గిఫ్ట్ కిట్ అందించేందుకు సర్పంచ్ డీఆర్ విజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. ఆగస్టు 15 నుంచి ఈ గిఫ్ట్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచ్ ఎన్నికల్లో ఎలాంటి హామీ ఇవ్వకపోయినప్పటికీ మహిళలకు తన వంతు సహాయంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు డీఆర్ విజయ్ కుమార్ తెలిపారు. ధరూర్ మండల కేంద్రంలో డెలివరీ అయిన ప్రతి మహిళకు పార్టీలకు అతీతంగా గిఫ్ట్ కిట్ అందిస్తామని పేర్కొన్నారు. కిట్‌లో చిన్నారులకు సంబంధించిన సామగ్రిని అందించనున్నట్లు తెలిపారు. ధరూర్ సర్పంచ్ డీఆర్ విజయ్ కుమార్ తీసుకున్న ఈ నిర్ణయంపై మండల కేంద్రంలోని మహిళలు, వివిధ పార్టీలకు చెందిన వారు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. తల్లులు, చిన్నారులకు ఉపయోగపడేలా గిఫ్ట్ కిట్లను అందించేందుకు ముందుకు రావడంపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## ఆర్‌అండ్‌బీ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా లింగా రెడ్డికి పదోన్నతి..



**ఆత్మకూరు (ఎం) ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన యాస లింగా రెడ్డి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్)గా పదోన్నతి పొందడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు కుటుంబంలో జన్మించిన ఆయన ఇంజనీరింగ్ విద్యను అభ్యసించి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. క్రమశిక్షణ, నిరంతర కృషి, పట్టుదలతో విధులు నిర్వర్తిస్తూ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ ప్రస్తుతం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఇంజనీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్)గా కీలక బాధ్యతలు చేపట్టారు. పరిపాలనా వ్యవహారాలు, పోస్టింగులు తదితర ముఖ్యమైన బాధ్యతలను నిర్వహించనున్న లింగా రెడ్డి పదోన్నతి ఆత్మకూరు గ్రామంతో పాటు మండల ప్రజలకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి ఉన్నత స్థాయికి ఎదిగి కీలక పదవిని చేపట్టిన లింగా రెడ్డి ఎంతోమంది యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని అభినందనలు తెలిపారు.

## స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

### - రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ
### - క్యూఆర్ కోడ్‌తో కార్డులకు పటిష్ట భద్రత
### - ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఆయిలయ్య



**యాదాద్రి భువనగిరి, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** స్మార్ట్ రేషన్ కార్డులు లబ్ధి దారుల గౌరవానికి ప్రతీకగా నిలుస్తాయి. శని వారం రోజు జిల్లా సమీ కృత కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య , జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ లతో కలసి లబ్ధి దారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ బెన్షాలోం , జనగామ మున్సిపల్ చైర్మన్ కడకంచి బాల మణి , డిసిసి అధ్యక్షు రాలు అధ్యక్షురాలు ధన్వంతి నాయక్ , యాదగిరిగుట్ట ట్రెస్ట్ బోర్డు డైరెక్టర్ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 6 కిలోల బియ్యం పొందే సౌకర్యం తో పాటు , క్యూ ఆర్ కోడ్ ద్వారా స్మార్ట్ రేషన్ కార్డు కు భద్రత కల్పించామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1.05 కోట్ల కుటుంబాలకు సుమారు రూ. కోటి 87 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, తద్వారా సుమారు 3.43 కోట్ల మంది ప్రయోజనం పొందనున్నారని చెప్పారు. పుట్టిన పిల్లల నమోదు , కొత్త రేషన్ కార్డులు , పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామని , ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డుతో సంక్షేమ సేవలు అందించుట , ప్రతి చివరి గడపకు పథకాల ఫలితాలను చేరవేయుట, ఆరు కిలోల బియ్యం సరఫరా , క్యూ ఆర్ కోడ్ ద్వారా రేషన్ పరి మాణాన్ని పరిశీలించడం , ఆరోగ్య పథకాలు , విద్యా ఫీజు రాయితీలు , ఇతర ప్రయోజనాలకు కార్డు ఎంతోగానో ఉపయోగ పడుతుందన్నారు. ఒంటరి మహిళలు , డయాలిసిస్‌తో ఇబ్బందులు పడుతున్న వారు , అర్హులైన ఇతరులు పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేర వేయడంలో జనగామ జిల్లా ముందంజలో ఉండేలా కృషి చేస్తున్న జిల్లా కలెక్టర్‌ను , ప్రభుత్వ విప్ అభినందించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం సంతోషకర మన్నారు. ఆధార్ కార్డు తరహాలో స్మార్ట్ రేషన్ కార్డు కూడా రాష్ట్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఉపయోగ పడుతుందని తెలిపారు.

**మీ సేవా కేంద్రం ప్రారంభం...**

అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీ-సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా , అదనపు కలెక్టర్ బెన్షాలోం లతో కలిసి ముఖ్య అతిథి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రారంభించారు. మీ - సేవా కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించి , వారి మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్య క్రమంలో డీసీసీ అధ్యక్షు రాలు లకావత్ ధన్వంతి, యాదగిరిగుట్ట దేవస్థానం బోర్డు సభ్యులు లక్ష్మీ నారాయణ నాయక్ , జనగామ , ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓలు గోపిరామ్ , కిరణ్ ప్రకాష్ , డీసీఎస్ఓ సురేష్ రెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు , రేషన్ కార్డు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం

- ◆ గూడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం 15 టీఎంసీలకు పెంపు
- ◆ జోగులాంబ గద్వాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ◆ అభివృద్ధి, సంక్షేమమే రెండు కళ్లుగా సుపరిపాలన
- ◆ న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి

**గద్వాల, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** జోగులాంబ గద్వాల జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని న్యూఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, ప్రభుత్వ సలహాదారు (క్రీడా వ్యవహారాలు) ఏపీ జితేందర్ రెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గద్వాల పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏపీ జితేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. దేశ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతం, వందేమాతరం, జాతీయ గీతాలను ఆలపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఓపెన్‌టాప్ జీపులో ముఖ్యఅతిథి ఏపీ జితేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు ప్రజలకు అభివాదం చేస్తూ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

**99 రోజుల కార్యాచరణతో ప్రజలకు చేరువ..**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణను చేపట్టామని ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు నిర్వహించిన కార్యాచరణలో పరిశుభ్రత, ఆరోగ్యం, రహదారి భద్రత, సంక్షేమ పథకాల అమలు, పిల్లల భద్రత, నో డ్రగ్స్ ప్రచారం, రైతు సంక్షేమం, విద్య, ఉపాధి అవకాశాలు, యువత, క్రీడలు, మహిళా శిశు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 3 కోట్ల 21 లక్షల 76 వేల మంది మహిళలు ప్రయోజనం పొందారని తెలిపారు. దీని ద్వారా రూ.123.78 కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 16,686 మందికి వివిధ వైద్య సేవలు అందించగా, ఇందుకోసం రూ.47.97 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.

**రైతులకు రూ.513.99 కోట్ల రుణమాఫీ..**

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే జిల్లాలో 58,113 మంది రైతులకు సంబంధించి రూ.513.99 కోట్ల పంట రుణాలను మాఫీ చేసి రుణ విముక్తులను చేసినట్లు ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. 2026--27 వానాకాలం సీజన్‌లో జిల్లాలో 1,72,417 మంది రైతుల ఖాతాల్లో రూ.263 కోట్లు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తూ, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. యాసంగి సీజన్‌లో 75 వరి కొనుగోలు కేంద్రాల ద్వారా 7,091 మంది రైతుల నుంచి 50,725 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.121.18 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖ కార్యక్రమాల అమలులో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో నిలిచిందన్నారు.



**సంక్షేమ పథకాలు అర్హులందరికీ..**

2026 ఏప్రిల్ నుంచి జూన్ వరకు జిల్లాలోని 1,90,671 రేషన్ కార్డుల పరిధిలో 6,76,293 మందికి మూడు నెలలకు సరిపడా 12,721 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని 337 రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆగస్టు 15 నుంచి జిల్లాలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో 6,795 ఇళ్లకు మంజూరు ఇవ్వగా ఇప్పటివరకు 649 ఇళ్లు పూర్తయ్యాయని, వాటిలో 388 ఇళ్లలో లబ్ధిదారులు గృహప్రవేశం చేశారని తెలిపారు. మరో 5,420 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వివరించారు. రూ.500కే వంట గ్యాస్ పథకం ద్వారా జిల్లాలో 95,752 మందికి లబ్ధి చేకూరిందని, ఇందుకోసం ప్రభుత్వం రూ.19.37 కోట్ల సబ్సిడీ అందించిందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 88,190 కుటుంబాలకు సంబంధించిన 21,23,838 జీరో బిల్లులకు రూ.57.09 కోట్ల సబ్సిడీ అందించినట్లు తెలిపారు. చేయూత పెన్షన్ పథకం కింద 66,548 మంది లబ్ధిదారులకు నెలకు రూ.16.23 కోట్ల విలువైన పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కొత్త పెన్షన్ల దరఖాస్తులను ఆగస్టు 31 వరకు అన్ని మండలాలు, మున్సిపల్ కార్యాలయాల్లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

**మహిళా సంఘాలకు భారీగా రుణాలు..**

జిల్లాలో 311 గ్రామ సంఘాల పరిధిలో 7,971 స్వయం సహాయక సంఘాల్లో 85,097 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో 7,222 స్వయం సహాయక సంఘాలకు రూ.212.65 కోట్ల బ్యాంకు రుణ లింకేజీ లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 593 సంఘాలకు రూ.66.03 కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం అమలులో జోగులాంబ గద్వాల జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉందన్నారు. ఇప్పటివరకు 552 మంది లబ్ధిదారులకు రూ.1.10 కోట్ల ఆర్థిక సాయం అందించామని, మరో 175 మంది లబ్ధిదారులకు పరిశీలన అనంతరం రూ.35 లక్షల సాయం అందిస్తామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో రూ.4.68 కోట్లతో 13 బస్సులను కొనుగోలు చేసి మహిళా సంఘాలకు అందించినట్లు వివరించారు.

**గూడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం 15 టీఎంసీలకు..**

జిల్లా అభివృద్ధిలో కీలకమైన గూడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యాన్ని 1.19 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచేందుకు ఈ నెల 14న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని ఏపీ జితేందర్ రెడ్డి తెలిపారు. గట్టు ఎత్తిపోతల ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1.3 టీఎంసీల నుంచి 3 టీఎంసీలకు పెంచుతూ రూ.1,781 కోట్లతో రీ-డిజైన్ చేసేందుకు కూడా క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి స్థాయిలో ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

**విద్యుత్, రహదారుల అభివృద్ధికి భారీ నిధులు..**

జిల్లాలో రూ.376.25 కోట్లతో నిర్మించిన వివిధ విద్యుత్ సబ్‌స్టేషన్లను ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించామని తెలిపారు. ఎర్రవల్లి మండల కేంద్రంలో రూ.155 కోట్లతో, గట్టు మండలం రాయపురం వద్ద రూ.48 కోట్లతో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా హామ్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.339.39 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో భాగంగా రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధరూరు వద్ద పనులకు శంకుస్థాపన చేశారని చెప్పారు.

**వైద్య, విద్య రంగాలకు ప్రాధాన్యం..**

గద్వాల మెడికల్ కళాశాల అకాడమిక్ బ్లాక్, వసతిగృహాల నిర్మాణానికి రూ.128 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. గద్వాలలో రూ.34.20 కోట్లతో నర్సింగ్ కళాశాల భవనాలు, రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్ భవనాలు నిర్మించామని, త్వరలో వాటిని ప్రారంభిస్తామని తెలిపారు. గద్వాలలో నూతన ఆర్డీవో కార్యాలయ భవనంతో పాటు రెండు నియోజకవర్గాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, కేటీ దొడ్డి, ఉండవెల్లి, రాజోలి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఓటర్ల ఎన్యూమరేషన్ 87.31 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, ఉమ్మడి జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. జనాభా గణన--2027లో భాగంగా ఇంటింటి గణనను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేసినట్లు చెప్పారు.

**విద్యారంగానికి మరింత ప్రాధాన్యం..**

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసి అక్షరాస్యతను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలల ప్రారంభానికి ముందే ప్రభుత్వ విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులకు ఎర్రవల్లిలో జ్ఞానదీప్తి పేరుతో శిక్షణ ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో అదనంగా 120 మంది విద్యా వాలంటీర్లను నియమించినట్లు తెలిపారు. జిల్లాకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలతో పాటు రెండు నియోజకవర్గాలకు తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం జిల్లా, రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణితో పాటు మండల స్థాయిలో ఎంపీడీవోల ఆధ్వర్యంలోనూ ప్రజావాణి నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు నిర్మాణ దశలో ఉన్నాయని, నడిగడ్డ ప్రాంత సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ ప్రజారంజక పాలన అందిస్తున్నామని, తెలంగాణ రైజింగ్--2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు.

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు..**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను అతిథులు అభినందించి బహుమతులు అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన వివిధ శాఖల అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలోని 617 మహిళా స్వయం సహాయక సంఘాలకు సంబంధించిన రూ.69 కోట్ల విలువైన చెక్కును సంఘాల ప్రతినిధులకు అందజేశారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల స్టాళ్లను అతిథులు పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి స్మార్ట్ రేషన్ కార్డులు

### - పేదలందరికీ నాణ్యమైన 6 కిలోల సన్నబియ్యం
### - తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి , జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి , ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , గ్రంధాలయ సంస్థల చైర్మన్ అవేజ్ చిస్తి , మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి లతో కలసి రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లడుతూ ప్రజలకు భద్రత తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డులు మరింత పారదర్శకంగా , అవకతవ కలకు తావు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు క్యూఆర్ కోడ్ భద్రతతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 2,51,513 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అభి వృద్ధి , సంక్షేమ రంగాలకు భారీగా నిధులను మంజూరు చేస్తున్నది. ఏప్రిల్-2025 మాసము నుండి అర్హులైన లబ్ధి దారులకు ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మొత్తం 5034 టన్నులకు గాను కిలోకు రూ.49.11 పైసలు చొప్పున మొత్తం రూ. 24,73,20,420/- ప్రభుత్వం నిధులు వినియోగిస్తుందన్నారు. ఆగస్టు , సెప్టెంబర్ , అక్టోబర్ 2026 మూడు నెలలకు గాను ఒకేసారి రేషన్ పంపిణీ చేయుటకై 15,104 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం కేటాయించడం జరిగిందన్నారు. దీనికి గాను మొత్తం రూ. 74,19,61,260/- ప్రభుత్వం నిధులు వినియోగిస్తుందన్నారు. రైతులకు రుణమాఫీ , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరంటు , సబ్సిడీ గ్యాస్ సిలెండర్ , కొత్త రేషన్ కార్డులు , సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగు తుందని తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. గత ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్ కార్డులు ఇవ్వడం జరగలేదని , ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా ముఖ్య మంత్రి ఒక గొప్ప ఆలోచన చేసి ముఖ్యమంత్రి ఏ బియ్యం అయితే తింటున్నారో అవే బియ్యం ప్రతి పేద కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడంతో కడుపు నిండా అన్నం తినడం జరుగుతుందని అన్నారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖ బాబురావు , మున్సిపల్ వైస్ చైర్మన్ మంజుల , ఆర్డీవోలు కృష్ణా రెడ్డి , శేఖర్ రెడ్డి , జిల్లా పౌర సరఫరాల అధికారి రోజారాణి , సంబంధిత అధికారులు , ప్రజా ప్రతి నిధులు , లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ పై కేసు నమోదు

### - పెద్ది విగ్రహ ప్రతిష్ట క్రమంలో పోలీసు విధులకు భంగం కలిగించారంటూ మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ పై కేసు
### - మరో నలుగురిపై కేసులు ముక్కున వేలు వేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

**నర్సంపేట, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** నర్సంపేట పట్టణాన్ని ఆనుకొని ఉన్న మెడికల్ కాలేజీ ఎదురుగా ఉద్యమ నాయకుడు దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ప్రైవేటు భూముల్లో ఏర్పాటు చేసేందుకు గద్దె నిర్మిస్తున్న క్రమంలో ఈ నెల 9వ తేదీన రాత్రి పది గంటల సమయంలో పర్మిషన్ లేదంటూ మున్సిపాలిటీ సిబ్బంది జెసిబి తో గద్దెని కూల్చివేశారు. కాగా ఈనెల 10వ తేదీన నర్సంపేట డివిజన్లోని నల్లబెల్లి మండల కేంద్రంలో స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభ జరిగే రోజునే టిఆర్ఎస్ శ్రేణులు తయారు చేయించిన ప్రతి సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ తో పాటు ఉద్యమకారులు లాయర్లు బిఆర్ఎస్ నాయకులు అదే మెడికల్ కాలేజీకి విచ్చేసి సరిత గర్జన గద్దెను ఏర్పాటు చేసి విగ్రహాన్ని ప్రతిష్టించే క్రమంలో పోలీసులకు బిఆర్ఎస్ నాయకులకు మాటలకు నడిచింది. దీంతో నాడు జరిగిన సంఘటనపై నర్సంపేటలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజు, ఎస్సై అరుణ్ పోలీస్ అధికారుల ద్వారా ఫిర్యాదు తీసుకొని నర్సంపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నరేందర్ తో పాటు ఏ వన్ గా శీలం వీరన్న ఏ2 గా వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, ఏ 3 గా 9వ వార్డు కౌన్సిలర్ రాయుడి దుష్యంతి రెడ్డి, ఏ 4 గా నెక్కొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సంఘాని సూరయ్య, ఏ 5 గా రవీందర్ లతోపాటు మరికొందరు ఉన్నట్లు నర్సంపేట పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా ఉద్యమ నాయకుడు తెలంగాణ ఉద్యమ వీరుడు సుదర్శన్ రెడ్డి పట్టుదల వల్లే మెడికల్ కాలేజీ నర్సంపేట విచ్చేసిందని అందుకు కృతజ్ఞతగా నర్సంపేట మెడికల్ కాలేజ్ ఎదురుగా ఉన్న ప్రైవేటు భూమిలో పెద్ది విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్న క్రమంలో అధికార పార్టీ నాయకుల



కనుచూపుమేరకు విగ్రహ గద్దెను కూల్చి వేయడంతోపాటు కేసులు నమోదు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఇది ముమ్మాటికి అధికార పార్టీ కవింపు చర్యల్లో భాగమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమకారుడు పెద్ద సుదర్శన్ రెడ్డి మృతి వల్ల యావత్ తెలంగాణ రాష్ట్రం గొల్లుమని కన్నీరు కార్చిందని కానీ నర్సంపేట కాంగ్రెస్ నాయకులకు కనికరం లేకుండా పోయిందని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.



# బ్రిటన్ రాజు బహిరంగ క్షమాపణ చెప్పాలి

- కొల్లగొట్టిన మన సంపదను తిరిగి ఇచ్చేయాలి
- బ్రిటన్ చరిత్ర పుస్తకాల్లో భారత్ పై ఉన్న అసత్యాలను సరి చేయాలి
- తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- పాల్గొన్న తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత..

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయులపై దాదాపు రెండు వందల ఏళ్ల పాటు బ్రిటీష్ పాలకులు సాగించిన అఘాయిత్యాలు, దోపిడీ, అరాచకాలకు బ్రిటన్ రాజు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. భారతదేశం నుంచి బ్రిటీష్ పాలకులు దోచుకెళ్లిన కోహినూర్ వజ్రంతో పాటు విలువైన సంపదను తిరిగి అప్పగించాలని కోరారు. 80వ



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం కవిత మాట్లాడారు. దేశానికి లభించిన స్వాతంత్ర్యం ఎంతో మంది పూర్వీకుల త్యాగాలు, పోరాటాల ఫలితమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, చరిత్ర తెలిసినవారే భవిష్యత్‌ను సమర్థవంతంగా నిర్మించగలరని అన్నారు. బ్రిటీష్ పాలనలో భారతీయులపై జరిగిన అనేక దారుణాలను ఈ సందర్భంగా కవిత ప్రస్తావించారు. జలియన్‌వాలాబాగ్ ఘటనలో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని, కృత్రిమ కరువుల కారణంగా వేలాది మంది మృత్యువాత పడ్డారని ఆరోపించారు. రెండు ప్రపంచ యుద్ధాలకు భారతీయ సైనికులను తరలించి, స్వాతంత్ర్యం ఇస్తామని హామీ ఇచ్చి ఆ తర్వాత మాట తప్పిన విషయాన్ని గుర్తు చేశారు. శాంతియుతంగా స్వాతంత్ర్యం కోసం పోరాడిన భారతీయులపై కూడా బ్రిటీష్ పాలకులు ఎన్నో అణచివేత చర్యలకు పాల్పడ్డారని అన్నారు. ఆ కాలం నాటి చరిత్రను వాస్తవాలతో సహా నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ఉందన్నారు. బ్రిటీష్ పాలనలో ఒకే భూభాగంగా ఉన్న భారత్‌ను ప్రజల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకోకుండానే విభజించారని కవిత పేర్కొన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య శాశ్వత వైరుధ్యాలకు ఆ విభజన కారణమైందని అన్నారు. అదే సమయంలో బ్రిటీష్ పాలనలోని సంస్కృతిని, ఇంగ్లీష్ మాట్లాడటాన్ని గొప్పగా భావించే మానసిక ధోరణి నుంచి బయటపడాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిటీష్ పాలకులు 'విభజించి పాలించు' విధానాన్ని అవలంబించారని, చర్మం రంగు ఆధారంగా వివక్ష చూపారని విమర్శించారు.



బ్రిటీష్ పాలన నాటి ఆనవాళ్ల నుంచి బయటపడటంతో పాటు మన దేశ సంస్కృతి, చరిత్ర, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని కవిత అన్నారు. వాటిని భవిష్యత్ తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బ్రిటన్ పాఠ్య పుస్తకాల్లో భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రను వక్రీకరించి ఉంటే వాటిని సరిచేయాలని ఆమె డిమాండ్ చేశారు. భారత చరిత్రను భారతీయుల దృక్కోణంలో కూడా ప్రపంచానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారతదేశంలో ఏళ్ల తరబడి ఉద్యమం కొనసాగిందని కవిత గుర్తుచేశారు. ఎన్నో ఎదురుదెబ్బలు ఎదురైనా పట్టు వదలకుండా పోరాడిన మహనీయుల త్యాగాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని, స్వాతంత్ర్య ఉద్యమంలో జరిగిన పోరాటాలు, త్యాగాల చరిత్రను పిల్లలకు తప్పనిసరిగా వివరించాలని కవిత పిలుపునిచ్చారు. దేశ చరిత్రను తెలుసుకుని, దాని నుంచి స్ఫూర్తి పొంది భవిష్యత్ తరాలు మరింత బలమైన భారతదేశాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు.

### రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం అందుకున్న

## అదనపు డీసీపీ జోగుల నర్సయ్య..

- సీపీ సజ్జనార్ ప్రత్యేక అభినందనలు..
- హైదరాబాద్ పోలీసులకు మరో గౌరవం

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్‌కు మరోసారి జాతీయ స్థాయిలో గౌరవం దక్కింది. రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపికైన సికింద్రాబాద్ జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్యను పోలీస్ కమిషనర్ సజ్జనార్ శుక్రవారం సీపీ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీపీ సజ్జనార్, విధి నిర్వహణలో అసాధారణ అంకితభావం, అత్యుత్తమ నిబద్ధత కనబరిచిన అధికారులకే ఇలాంటి అత్యున్నత పురస్కారాలు లభిస్తాయని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత కోసం అదనపు డీసీపీ నర్సయ్య చేసిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం అందుకోవడం ద్వారా హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ ప్రతిష్ఠను మరింత పెంచారని అన్నారు. పోలీసు సేవలో 35 ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన జోగుల నర్సయ్య 1991లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి పలు కీలక బాధ్యతలు నిర్వహిస్తూ అనేక క్లిష్ట కేసులను విజయవంతంగా దర్యాప్తు చేయడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. ప్రజలకు చేరువైన పోలీసింగ్, నేర నియంత్రణ, సమర్థవంతమైన పరిపాలనలో ఆయన చేసిన కృషికి ఇప్పటికే పలు ప్రశంసలు లభించాయి. గతంలో కూడా ఆయన ఇండియన్ పోలీస్ మెడల్ (ఐపీఎం) సహా అనేక ప్రతిష్ఠాత్మక పతకాలను అందుకున్నారు. తాజాగా రాష్ట్రపతి విశిష్ట సేవా పతకానికి ఎంపిక కావడం ఆయన సేవలకు మరో గొప్ప గుర్తింపుగా నిలిచింది.

ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. జోగుల నర్సయ్య సాధించిన ఈ ఘనత ఇతర పోలీసు అధికారులు, సిబ్బందికి



స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజా భద్రత కోసం అంకితభావంతో పనిచేసే ప్రతి పోలీసు అధికారి ఇలాంటి గుర్తింపులు సాధించాలని ఆకాంక్షించారు. విధి పట్ల నిబద్ధత, ప్రజాసేవ పట్ల అంకితభావం ఉంటే గుర్తింపు తప్పకుండా లభిస్తుంది. జోగుల నర్సయ్య సాధించిన ఈ ఘనత హైదరాబాద్ పోలీసులందరికీ గర్వకారణమని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## జనగాం జిల్లా ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా మరిపెల్ల రవిప్రసాద్

- సామాజిక సేవలకు ప్రతిష్ఠాత్మక పురస్కారం.. ఘనంగా సన్మానం
- అభినందనలు తెలిపిన డీఐఈఓ జితేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ నాముని పావనికుమారి

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** జనగాం జిల్లా స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మకంచ, జనగాంలో లెక్చరర్‌గా పని చేస్తున్న మరిపెల్ల రవిప్రసాద్ ఎంపికయ్యారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జనగాం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా రవిప్రసాద్ సన్మానం, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, దేశభక్తి పెంపొందించేందుకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కింది. మరిపెల్ల రవిప్రసాద్ గత మూడు సంవత్సరాలుగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా అనేక సామాజిక, అవగాహన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. రెగ్యులర్ ఎన్ఎస్ఎస్



కార్యకలాపాలు, ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌లు, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే యూత్ లీడర్‌షిప్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లకు వాలంటీర్లను పంపించడం, ఎయిడ్స్ అవగాహన ర్యాలీలు, వనమహోత్సవ ర్యాలీ, సద్భావన ర్యాలీ, ఓటర్ అవగాహన కార్యక్రమాలు, ర్యాగింగ్ వ్యతిరేక ర్యాలీలను నిర్వహించారు. పల్స్ పోలియో ఇమ్యునైజేషన్, కోవిడ్-19 అవగాహన కార్యక్రమాలు, యూత్ ఫెస్టివల్స్, జాతీయ సమైక్యతా దినోత్సవ కార్యక్రమాలతో పాటు మేడారం జాతర క్యాంపును కూడా విజయవంతంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను కేవలం కళాశాల కార్యకలాపాలకే పరిమితం చేయకుండా సమాజహిత కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడంలో రవిప్రసాద్ ప్రత్యేక శ్రద్ధ చూపారు. యువతలో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేలా నిరంతరం కార్యక్రమాలు చేపట్టారు. ఆయన సేవలను గుర్తించిన జిల్లా అధికారులు ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డుకు ఎంపిక చేశారు.

జనగాం జిల్లా ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా అవార్డు పొందిన మరిపెల్ల రవిప్రసాద్‌ను కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ ఈసం నారాయణ, డీఐఈఓ జితేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నాముని పావనికుమారి, సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రేణికుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ వస్కుల శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అభినందించారు. సామాజిక సేవలో మరింత ముందుకు సాగుతూ యువతకు ఆదర్శంగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

## భూములపై బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని మోసం..

- 20కి పైగా కేసుల్లో నిందితుడైన అంతర్రాష్ట్ర కేటుగాడు..
- అదుపులోకి తీసుకున్న సీసీఎస్ పోలీసులు

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** సొంత ఆస్తులు, స్థలాలపై బ్యాంక్ రుణాలు ఇప్పిస్తామని నమ్మించి, ఆ సేల్ డీడ్ కాగితాలను మూడో వ్యక్తికి బదిలీ చేసి కోట్లాది రూపాయల మేర ఘరానా మోసాలకు పాల్పడుతున్న కిలాడీ కేటుగాడిని హైదరాబాద్ డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ (సీసీఎస్) పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అరెస్టయిన నిందితుడిని రంగారెడ్డి జిల్లా కొండాపూర్ నివాసి సునావత్ యుగంధర్ (34)గా గుర్తించారు. నిందితుడిపై 2016 నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 20కి పైగా క్రిమినల్ మరియు సివిల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

**కేసు వివరాలు :** ఫిర్యాదుదారుడికి రూ. 60 లక్షల ఆర్థిక సాయం అందించిన నిందితుడు సునావత్ యుగంధర్, ఆ ఆస్తిని వేరొకరికి విక్రయించనని ఒప్పందం చేసుకుని సేల్ డీడ్ రాయించు కున్నాడు. అయితే, ఫిర్యాదు దారునికి తెలియకుండా ఆ సేల్ డీడ్ ను దుర్వినియోగం చేస్తూ ఆ ఆస్తిని మూడో వ్యక్తి పేరిట మార్చే శాడు. అనంతరం ఆ ఆస్తిని కుదువబెట్టి ఆక్సిస్ బ్యాంక్ నుండి సుమారు రూ. 1.50 కోట్ల మేరరుణం పొంది, డిఫాల్ట్ అయ్యాడు. బ్యాంక్ అధికారులు రుణం చెల్లించాలని ఫిర్యాదు దారునికి నోటీసులు పంపడంతో నిందితుడి మోసం బయటపడింది.



**మోసాల తీరు, నేర చరిత్ర :** నిందితుడు యుగంధర్ ఆస్తులపై రుణాలు ఇప్పిస్తామని నమ్మించి ఇప్పటివరకు 30 మందికి పైగా అమాయకు లను నమ్మించి సుమారు రూ. 10 కోట్లకు పైగా మోసగించినట్లు విచారణలో తేలింది. నిందితుడిపై ఇదివరకే 12 క్రిమినల్ కేసులు, 08 సివిల్, ఎన్.ఐ. యాక్ట్ కేసులు నమోదయ్యాయి. మరో 4 కేసుల్లో నిందితుడు పరారీలో ఉన్నాడు.

**పోలీసు చర్యలు :** హైదరాబాద్ సీసీఎస్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో, ఈఓడబ్ల్యు టీమ్-5, ఏసీపీ కె.కిరణ్ మార్గ దర్శకత్వంలో ఎస్ఐ జి.అనిల్ కుమార్, సిబ్బంది నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీ సులు (క్రైం నెంబర్:128/2026 యూ/ఎస్ 420 ఐపీసీ) నింది తుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

**ప్రజలకు విజ్ఞప్తి :** ఆస్తులపై రుణాలు ఇప్పిస్తామంటూ వచ్చే నకిలీ ఫైనాన్స్ కన్సల్టెన్సీలు, వ్యక్తిగత మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని, ఆస్తుల పత్రాలు అప్పగించే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని సీసీఎస్ డీసీపీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఘనంగా స్వాతంత్ర వేడుకలు..

- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి..

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర దినోత్సవ వేడుకలను సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆవరణలో శనివారం నాడు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయకుమార్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్ ,జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్ధెల్లి బాబురావు, కోశాధికారి రమేష్ వైట్ల, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ఎన్. శ్రీనివాస్ రెడ్డి, ముత్యాల సత్తిబాబు, వనం నాగరాజు, శిగ శంకర్ గౌడ్, ఎన్. ఉమాదేవి , రచన ముడింబి, అమిత్ బట్టు,సీనియర్ జర్నలిస్టులు, చిన్నపత్రికల సంఘం నేతలు యూసుఫ్ బాబు, అగస్టీన్, గొల్ల రమేష్ ,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. స్వతంత్ర సాధన కోసం పోరాటం చేసిన త్యాగధనుల సేవలను ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ పాలకమండలి గుర్తు చేసింది. జాతీయ నేతల స్ఫూర్తిని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయకుమార్ రెడ్డి, రమేష్ వరికుప్పల అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్ ఇండియా తొలిసారిగా హైదరాబాదులో మీడియా స్వేచ్ఛ- జర్నలిస్టుల రక్షణపై ఈనెల 22, 23వ తేదీల్లో భారీ కాన్ క్లేవ్



నిర్వహించనున్నట్టు విజయకుమార్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. దేశంలోని ప్రెస్ క్లబ్ ల నేతలు ప్రముఖ సీనియర్ జర్నలిస్టులు ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో పాల్గొంటారని విజయకుమార్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ రెండు రోజుల జాతీయ సదస్సును విజయవంతం చేయడానికి సన్నాహాలు ప్రారంభించినట్లు వివరించారు.

## 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

- తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్యక్రమం..



**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** 80వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ నాన్-గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, హైదరాబాద్ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్. విక్రమ్ కుమార్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్షులు ఎస్. విక్రమ్ కుమార్ మాట్లాడుతూ.. "స్వాతంత్ర సమరయోధుల నిస్వార్థ త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛావాయువులు పీలుస్తున్నాం. యువత దేశభక్తి భావాలను పెంపొందించుకోవడమే కాకుండా, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి. బాధ్యతాయుతమైన ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, దేశ సమగ్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ ముందుండాలి" అని సందేశానిచ్చారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె.ఆర్. రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బొలిగడ్డ శంకర్, ప్రచార కార్యదర్శి వైదిక్ శ్రేష్ట, ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ ప్రతినిధి ఆర్. కృష్ణ, ఆఫీస్ పీఆర్ఓ మహమ్మద్ వాహెద్ తో పాటు వివిధ యూనిట్ల ప్రతినిధులు, ప్రాథమిక సభ్యులు, ఉద్యోగులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### డీజీపీ కార్యాలయంలో

## ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్డీకాపూల్ లోని డీజీపీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా షానవాజ్ ఖాసిం, ఐజీ -మల్టీ జోన్ - 2 జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐజీ రమణ కుమార్, జె.అన్యోన్య, ఏఐజి (అడ్మిన్), ఎస్పీ (లీగల్) సతీష్, సిఎస్ఓ యోగేశ్వర్ రావుతో పాటు పలువురు పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



### ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంత రావుని

## కలిసిన టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ ప్రతినిధులు



**కామారెడ్డి, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** కామారెడ్డిజిల్లాకేంద్రంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావును శనివారం జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి ప్రతినిధి బృందం కలిసి స్వాగతం పలికారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా పర్యటనలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడానికి కామారెడ్డి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వి.హనుమంత రావుని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, సహాధ్యక్షులు ఎం.చక్రధర్, టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంతోష్ కుమార్,కామారెడ్డి అర్బన్ తాలూకా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, దోమకొండ తాలూకా అధ్యక్షులు భూపాల్ సంతోష్,జిల్లా కార్యదర్శుల ఫోరమ్ అధ్యక్షులు మహేష్ గౌడ్, వెటర్నరీ డిపార్ట్మెంట్ అధ్యక్ష కార్యదర్శులు ఎమ్ఎస్ రావు, బి.కొండల్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజవీరయ్య, జాయింట్ సెక్రటరీ బి.మహేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజుకు

## ప్రతిష్టాత్మక సేవా మెడల్..

- సీపీ రమేష్ రెడ్డి చేతులమీదుగా రాష్ట్ర సేవా మెడల్..
- నర్సింహారాజును అభినందించిన పలువురు..

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీస్ శాఖలో అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు ప్రతిష్టాత్మక తెలంగాణ రాష్ట్ర సేవా మెడల్ అందుకున్నారు. శనివారం జరిగిన కార్యక్రమంలో సీపీ రమేష్ రెడ్డి సర్ చేతుల మీదుగా నర్సింహా రాజు ఈ ప్రతిష్టాత్మక సేవా మెడల్ ను స్వీకరించారు. ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్ గా బాధ్యతలు నిర్వహిస్తూ, పోలీస్ వృత్తి నీ సామాజిక బాధ్యత గా నిర్వహిస్తూ ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో చూపిన అంకితభావం, కర్తవ్యనిష్ఠ, సమర్థవంతమైన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించడం విశేషం. సేవా మెడల్ అందుకున్న సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నర్సింహా రావును పోలీస్ అధికారులు, సిబ్బంది, సహచరులు అభినందించారు. పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని, ప్రజల భద్రత మరియు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మరింత అంకితభావంతో పనిచేస్తానని నర్సింహారాజు తెలిపారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారికి రాష్ట్ర స్థాయి సేవా పురస్కారం లభించడం పట్ల స్థానికంగా కూడా హర్షం వ్యక్తమవుతోంది.



### ఎస్.ఓ.టి. ఆర్.సి.పురం సబ్ యూనిట్

## నూతన కార్యాలయ భవనం ప్రారంభం..

- ప్రారంభించిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్..

**హైదరాబాద్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :** నూతనంగా ఏర్పాటైన ఎస్.ఓ.టి. ఆర్.సి.పురం సబ్ యూనిట్ నూతన కార్యాలయ భవనాన్ని శనివారం రోజు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ కార్యాలయాన్ని పరిశీలించి, సిబ్బందికి అందుబాటులో ఉన్న వసతులు, కార్యాలయ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. నేర నియంత్రణ, అక్రమ కార్యకలాపాలపై నిఘా, కీలక కేసుల దర్యాప్తులో ఎస్.ఓ.టి. విభాగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణ, ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయడంలో భాగంగా ఎస్.ఓ.టి. విభాగాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ.టి. డీసీపీ పి. శోభన్ కుమార్, అడిషనల్ డీసీపీ టి. గోవర్ధన్, శేరిలింగంపల్లి డీసీపీ సి.హెచ్. శ్రీనివాస్, సైబరాబాద్ పరిధిలోని వివిధ జోన్లకు చెందిన ఎస్.ఓ.టి., సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఓ.టి. సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**రామ్ మందిర్ ఏరియా, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

గోదావరిఖని: 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీనగర్‌లోని సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి పెద్దపల్లి పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. అయితే స్వాతంత్ర్య ఫలాలు ఇప్పటికీ పేద, బడుగు వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ చేసిన సేవలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. రానున్న రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ ప్రజలందరికీ 80వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు సంగేపు రాజు, గుండెబోయిన ఓదెలు యాదవ్, చిటికెల రాజలింగం, వేముల సంపత్, ఎండి ఆజాం, వడ్డేపల్లి నారాయణ, మంచికట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ కాలనీలు, ప్రాంతాల్లో టీడీపీ నాయకులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. జీఎం ఆఫీస్ కాలనీలో పెద్దపల్లి సత్యనారాయణ, పెద్దపల్లి సత్యనారాయణ చౌరస్తాలో గుండెబోయిన ఓదెలు యాదవ్, బస్టాండ్ కాలనీలో చిటికెల రాజలింగం, పవర్‌హౌస్ కాలనీలో సంగేపు రాజు, 2వ గనిలో వేముల సంపత్, 1వ గనిలో పెద్దపల్లి సత్యనారాయణ, 8వ కాలనీలో చెవ్వ మల్లయ్య జాతీయ పతాకాలను ఆవిష్కరించి ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.




# అంబులెన్సులతో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ ర్యాలీ



**రామ్ మందిర్ ఏరియా, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

గోదావరిఖని: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆల్ ఇండియా అంబులెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖనిలో అంబులెన్సులతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మిరియాల విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కళ్యాణ్‌నగర్ చౌరస్తా నుంచి లక్ష్మీనగర్ ఆసుపత్రుల వీధి వరకు ర్యాలీ కొనసాగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ.. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్, వరంగల్ ప్రభుత్వ ఆసుపత్రులకు రోగులను తరలించాల్సి వచ్చినప్పుడు కేవలం ఇంధన ఖర్చులు మాత్రమే తీసుకుని ఉచితంగా అంబులెన్స్ సేవలు అందిస్తామని తెలిపారు. ప్రజలకు అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉండేలా తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అంబులెన్సులతో ర్యాలీ నిర్వహించడం ద్వారా ప్రజల్లో దేశభక్తి, జాతీయతా భావాలను పెంపొందించేందుకు తమ వంతు కృషి చేశామని తెలిపారు. ర్యాలీ విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అంబులెన్స్ యూనియన్ నాయకులు మిరియాల విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, రాజు, దిలీప్ కుమార్, ప్రవీణ్, శివ, సందీప్, తిరుపతి, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో ఎస్ఐ సుప్రియ ప్రతిభ

**జగిత్యాల, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

శాంతిభద్రతల పరిరక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ విధుల పట్ల అంకితభావంతో పనిచేసిన జగిత్యాల పట్టణ ఎస్ఐ సుప్రియకు ప్రశంసాపత్రం లభించింది. 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర మంత్రి అజారుద్దీన్ చేతుల మీదుగా ఆమె ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించినందుకు ఈ ప్రశంసపత్రం లభించింది. ఈ సందర్భంగా ఎస్ఐ సుప్రియను పోలీసు అధికారులు సిబ్బంది అభినందించారు.



# ప్రగతిలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**రాయికల్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

ప్రగతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, దేశభక్తి గీతాలు, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా నిర్వహించిన ఎఫ్ఏ 1 పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి అభినందించారు. అలాగే క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందించారు.ప్రిన్సిపాల్ బాలె శేఖర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావనలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి విద్యార్థి తెలుసుకొని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. చదువుతో పాటు సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు.మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహనీయులు చేసిన త్యాగాలు చిరస్మరణీయమన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని, వారు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని కష్టపడి చదివి సమాజానికి, దేశానికి సేవ చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగుతూ తల్లిదండ్రులకు, పాఠశాలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలె శేఖర్, జయశ్రీ, నిఖిల్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు. దేశభక్తి నినాదాలు, జాతీయ గీతాలతో పాఠశాల ప్రాంగణం మార్మోగింది.



## దివ్యాంగుల సంక్షేమ సంఘం,కళారాధన, లయన్స్ క్లబ్, ఐఎంఏ,క్రీడా సమాఖ్య కార్యాలయం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

# జాతీయ పతాకం ఎగురవేసిన డాక్టర్ రవి కృష్ణ

**నంద్యాల, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

నంద్యాల కళారాధన సాంస్కృతిక సంస్థ, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, లయన్స్ క్లబ్,క్రీడా సమాఖ్య కార్యాలయం వద్ద లయన్స్ అంతర్జాతీయ సంస్థ డిస్ట్రిక్ట్ 316 జె వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు, కళారాదన వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ జాతీయ పతాకాన్ని ఎగురవేసి పతాక వందనం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తాము ఎంచుకున్న రంగంలో అంకితభావంతో పనిచేసి దేశఅభివృద్ధిలో పాలుపంచుకోవలసిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎం.పి.వి. రమణయ్య,కార్యదర్శి రామలింగం, ఉపాధ్యక్షులు వెంకటరావు, కార్యవర్గ సభ్యులు రంగస్వామి, మధు కుమార్, చలపతి, వీరభద్రుడు, వినోద్, కరీముల్లా, నంద్యాల జిల్లా చెస్ సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి,కళారాధన కార్యవర్గ సభ్యులు శివరామిరెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రమోహన్ ఇమ్మడి రామకృష్ణుడు,రామయ్య,కార్యాలయ కార్యదర్శి మధు, తదితరులు పాల్గొన్నారు.



# పల్సి విద్యా భారతి పాఠశాలలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**నిర్మల్ జిల్లా, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురం శెట్టి లింగయ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.
ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన దేశభక్తి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల ప్రదర్శనలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.ప్రధానోపాధ్యాయుడు పురం శెట్టి లింగయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. దేశభక్తి, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు.
కార్యక్రమంలో ఉపాధ్యాయులు పోతన్న, మధుసూదన్, సాయినాథ్, రాజు, దేవకి, రాణి, శృతి, పద్మ, సరోజన, గంగామణి, లక్ష్మి, కవిత, నేహా, భువనేశ్వరి, గంగావేణి, శ్రీవిద్యతో పాటు విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## అక్షర బంధం ఇంకా చెదరలేదు.. బడికి పూర్వ విద్యార్థుల చేయూత

# 35 కుర్చీల వితరణ.. చిన్నారుల చదువుకు చేయూత

**పిట్లం, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

చదువు నేర్పిన పాఠశాలను మరువకుండా పూర్వ విద్యార్థులు తమవంతు సహకారం అందించారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిల్లర్గి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు 201011 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 35 కుర్చీలను వితరణ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలోని ఒకటో తరగతి విద్యార్థుల కోసం వీటిని అందజేశారు.
తాము చిన్ననాట విద్యాబుద్ధులు నేర్చుకున్న పాఠశాలలో ప్రస్తుతం చదువుకుంటున్న చిన్నారులకు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలనే సంకల్పంతో ముందుకు రావడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.
చదువు నేర్పిన పాఠశాలకు తిరిగి ఏదైనా చేయాలనే ఆలోచనతోనే కుర్చీలను అందించామని, భవిష్యత్తులోనూ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. తాము చదువుకున్న బడిపై మమకారాన్ని చాటుతూ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



## ఫ్లేర్ హైస్కూల్‌లో ఘనంగా

# 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**నిర్మల్ జిల్లా, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండలంలోని ఫ్లేర్ హైస్కూల్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు, ప్రసంగాలతో ఆకట్టుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధిలో విద్యార్థులు బాధ్యతగా వ్యవహరించాలని వక్తలు సూచించారు.పాఠశాల కరస్పాండెంట్ కె.వి. నరసింహారెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జ్ బోజారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. "దేశభక్తి మన హృదయంలో.. దేశసేవ మన చేతల్లో.." అనే స్ఫూర్తితో వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు.

# మండల ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

## - మల్లంపల్లి ఎంపీడీవో ఎం.డి.రహీమొద్దీన్



**మల్లంపల్లి, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండల ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మల్లంపల్లి ఎంపీడీవో ఎం.డి. రహీమొద్దీన్ తెలిపారు.ఈ నెల 17వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారులకు నేరుగా అందజేయవచ్చని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు వినతులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించనున్నట్లు, మండలంలోని అన్ని శాఖల అధికారులు కార్యక్రమానికి హాజరవుతారని ఎంపీడీవో వెల్లడించారు.సమస్యలు ఉన్న ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని తెలిపారు.

# 9'ఫైర్ బాయ్'జ్ యూత్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలో నవీన్ గౌడ్

## జాతీయ జెండాను ఆహోవిష్కరించిన భండారి నవీన్ గౌడ్



**కూకట్‌పల్లి, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

కూకట్పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల్ పరిధిలో వినాయక్ నగర్ లో 9' ఫైర్ బోయ్స్ యూత్ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు . ముఖ్య అతిధిగా బండారి నవీన్ ప్రకాష్ గౌడ్ సీనియర్ లీడర్ గారు జండా ఆహోవిష్కరించి అనంతరం వందేమాతర గేయం ఆలపించి దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహానీయులను స్మరించుకున్నారు.అనంతరం పిల్లలకు స్వీట్స్ , అరటిపళ్లు అందించారు . కార్యక్రమం లో పుష్పరాజు గారు ,రవి ముదిరాజ్ ,సుమన్ ,రాజు గౌడ్ , వినోద్ నాయుడు , వెంకట్ సునీల్ ,ఝాన్సీ , ప్రదీప్, శివ మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు

# రాయికల్ మత్స్యకారుల సహకార సంఘానికి నూతన పాలకవర్గం




**రాయికల్, ఆగస్టు 16 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాయికల్ మత్స్యకారుల సహకార సంఘం లిమిటెడ్‌కు నూతన పాలకవర్గం ఎన్నికైంది. తెలంగాణ రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8న నిర్వహించిన ఎన్నికల్లో నూతన కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. ఈ మేరకు 10న జారీ చేసిన ఎన్నికల ధ్రువీకరణ పత్రంలో నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు.సంఘం అధ్యక్షుడిగా చెర్లకొండాపూర్ మాజీ సర్పంచ్ ఆర్మూరి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా కల్లెడ శంకర్, కార్యదర్శిగా కల్లెడ రాజేష్ ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులుగా దువ్వక నారాయణ, దువ్వక నరేష్,చిట్యాల సురేష్, దేవుని రాజం, తొకల లింగం, తొకల నవీన్ ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గం పదవీకాలం 07-08-2031 వరకు కొనసాగనుంది.మత్స్యకారుల సంక్షేమం, సంఘం అభివృద్ధితో పాటు సభ్యులకు మెరుగైన సేవలు అందించేలా నూతన కమిటీ కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ సభ్యులను సంఘ సభ్యులు, రాయికల్ మున్సిపల్ కౌన్సిలర్ కునారపు మానస భూమేశ్వర్ ఘనంగా సన్మానించారు.

## అసెంబ్లీ సమావేశాలకు అమరావతిలో పటిష్ట భద్రత



○ పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో అమరావతి అసెంబ్లీ పరిసరాల్లో గుంటూరు జిల్లా పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల భద్రతతో పాటు శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.
ఆదివారం సాయంత్రం తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎస్పీ బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ భవనం, ప్రవేశ ద్వారాలు, అసెంబ్లీ హాల్, మండలి హాల్, వీఐపీ మార్గాలు, చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా**

భద్రతలో భాగంగా డ్రోన్ ఆధారిత నిఘా, అధునాతన సీసీ కెమెరాల పర్యవేక్షణ, బాంబు గుర్తింపు బృందాలు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రతి భద్రతా చర్యను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.
ప్రజాప్రతినిధులు, విలేకరులు, ఇతర ప్రముఖులతో విధి నిర్వహణలో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు భద్రతా నిబంధనలను రాజీపడకుండా అమలు చేయాలని సూచించారు.

**అనుమతి లేని ర్యాలీలకు నో**

అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ పరిసరాల్లో అనుమతి లేకుండా ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలకు అనుమతి ఉండదని ఎస్పీ స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి ప్రయత్నాలనైనా వెంటనే అడ్డుకోవాలని అధికారులకు ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా ప్రతి అధికారి, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.
సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఎస్బీ డీఎస్పీ అలహరి శ్రీనివాస్, ఎస్డీపీఓలు మురళీకృష్ణ, పూర్ణచంద్రరావు, ఏఆర్ డీఎస్పీ సుంకరయ్య, సీఐ మల్లికార్జునరావు, తుళ్లూరు ఎస్హెచ్ఓ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నేరాలకు స్వస్తి పలికి చట్టబద్ధమైన జీవనం సాగించాలి



○ రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వారికి గుంటూరు పోలీసుల ప్రత్యేక కౌన్సిలింగ్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** నేరాలకు దూరంగా ఉంటూ చట్టాలను గౌరవించే బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని గుంటూరు జిల్లా పోలీసులు రౌడీ షీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, గతంలో జరిగిన తప్పిదాలను మరచి ఇకపై చట్టబద్ధమైన జీవనం సాగించాలని హితవు పలికారు. కుటుంబ సభ్యులు, సమాజం గర్వించేలా మంచి ప్రవర్తనతో జీవిస్తూ ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని సూచించారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలు, నేరాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రౌడీ షీటర్లు, నేరప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో నేరాలకు స్వస్తి పలికి సన్మార్గంలో జీవించాలని నిర్ణయించుకున్న వారికి పోలీసు శాఖ నుంచి అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. యువత చెడు మార్గాల్లోకి వెళ్లకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు గుంటూరు జిల్లా పోలీసులు నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని, శాంతియుత సమాజ నిర్మాణానికి ప్రజల సహకారం అవసరమని అధికారులు తెలిపారు.

# బడుగు వర్గాల పెన్నిధి సర్దార్ గౌతు లచ్చన్న



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి సందర్భంగా బస్ స్టేషన్ సమీపంలో ఓల్డ్ క్లబ్ రహదారిలో గల సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి శాసన సభ్యులు నసీర్ అహ్మద్ తో కలిసి జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేసిన సర్దార్ గౌతు లచ్చన్న పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఎంతో అవసరమన్నారు. దేశ సేవతో బలహీన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన సేవలు భావితరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. దీనాజనోద్ధరణే శపథంగా, వ్యవస్థల ప్రక్షాళనే లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. చిన్న వయసులోనే దేశభక్తి, సామాజిక సమానత్వ భావాలు ఆయనపై ప్రభావం చూపాయన్నారు. బ్రిటిష్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్యాయాలను గమనించి స్వాతంత్ర్య ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారని చెప్పారు.
శాసన సభ్యులు నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సర్దార్ గౌతు లచ్చన్న సాగించిన రైతు ఉద్యమాలు ఎంతో మేలు చేశాయన్నారు. గౌతు లచ్చన్న 1909 ఆగస్టు16న జన్మించారని అన్నారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు--కార్మిక ఉద్యమ నాయకుడు, సామాజిక సంస్కర్త, రాజకీయవేత్త అని పేర్కొన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.
యువకుడిగా ఉన్నప్పుడే బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాల్లో పాల్గొన్నారని, ఉప్పు సత్యాగ్రహం, శాసనోల్లంఘన ఉద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం వంటి జాతీయోద్యమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని వివరించారు.
రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, వెనుకబడిన వర్గాల సమస్యలపై నిరంతరం ఉద్యమించారన్నారు. ప్రత్యేకంగా కల్లు గీత కార్మికులు, తాటి చెట్లు ఆధారంగా జీవించే కుటుంబాలు, గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. పదవుల కంటే ప్రజా సమస్యలపై తన నిబద్ధతకే ఆయన ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. సామాజిక సమానత్వం ప్రధానమైనదిగా భావిస్తూ, కుల, ఆర్థిక వివక్షలకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నతుడు అన్నారు.
తన రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా ప్రజల కోసం పోరాటాన్ని కొనసాగించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి మయూరి, ప్రజా ప్రతినిధులు, అనధికారులు పాల్గొన్నారు. .

## నితిన్ నబీన్‌కు భోగాపురంలో ఘన స్వాగతానికి బీజేపీ సన్నాహాలు

○ విజయనగరం జిల్లా కార్యకర్తలతో రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్ సమీక్ష



**విజయనగరం(జర్నలిస్ట్ ఫైల్):** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సోమవారం భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి రానున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్ ఆదివారం విజయనగరం జిల్లా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ, జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నితిన్ నబీన్ తొలి ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వస్తుండటం రాష్ట్ర బీజేపీకి గర్వకారణమన్నారు. భోగాపురం విమానాశ్రయంలో వేలాది మంది కార్యకర్తల సమక్షంలో సంప్రదాయబద్ధంగా, క్రమశిక్షణతో స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్న ఆయన, ఈ ప్రాంతానికి పర్యాటకం, పారిశ్రామిక రంగం, ఉపాధి అవకాశాల్లో కొత్త దశకు నాంది పలుకుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఉత్తరాంధ్రకు లభిస్తున్న మౌలిక వసతుల ప్రాజెక్టులు రాష్ట్ర ప్రగతికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని చెప్పారు.
ఆగస్టు 18న విశాఖపట్నంలో నిర్వహించే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పార్టీ సంస్థాగత బలోపేతానికి కీలక వేదికగా మారనుందని మధుకర్ తెలిపారు. రాష్ట్రంలోని మండలాల నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తారని వెల్లడించారు.
జాతీయ అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్రమశిక్షణతో పార్టీ ప్రతిష్ఠను చాటాలని మధుకర్ పిలుపునిచ్చారు.
సమావేశంలో విజయనగరం జిల్లా బీజేపీ నాయకులు, మండల అధ్యక్షులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల చదువుకు అండగా శివశక్తి ఫౌండేషన్

○ విద్యతోనే కుటుంబ జీవితాల్లో మార్పు
○ 27 మంది దర్జీ పిల్లలకు స్కాలర్షిప్లు అందజేసిన జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** చదువుకు పేదరికం అడ్డు కాదని, విద్యతోనే పేద కుటుంబాల జీవితాల్లో మార్పు సాధ్యమని ప్రభుత్వ చీఫ్ విప్, సీరియల్ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు అన్నారు. ఆదివారం చీఫ్ విప్ కార్యాలయంలో వినుకొండ నియోజకవర్గం టైలర్స్ అసోసియేషన్ సభ్యుల పిల్లలకు శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్కాలర్షిప్ల పంపిణీ కార్యక్రమానికి చీఫ్ విప్ జీవి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు స్కాలర్షిప్లు అందజేశారు. బీటెక్, బీఎస్సీ, బీకాం, బిఎ, బి బి ఎ, డిప్లమా, నర్సింగ్, బి ఫార్మసీ అభ్యసిస్తున్న 27 మంది విద్యార్థులకు 1,13,000 నగదు స్కాలర్షిప్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యలో మంచి ప్రతిభను కనబరిచి జీవితంలో ఉన్నత స్థాయి నందు స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. శివశక్తి ఫౌండేషన్ విద్యార్థుల ఉన్నత చదువుకు అండగా నిలవడం అభినందనీయమని అన్నారు. విద్య పై పెట్టే పెట్టుబడే సమాజ భవిష్యత్తుకు పెట్టుబడి అని సూచించారు.
విద్యార్థులు చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించి ఆర్థికంగా స్థిరపడి భవిష్యత్తులో పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు.
శివశక్తి లీల అండ్ అంజన్ ఫౌండేషన్ నిరంతరం ప్రజలకు సేవ చేస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. స్కాలర్షిప్లు అందుకున్న విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలకు చేరువ కావాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, టైలర్ అసోసియేషన్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

# జూడా సమ్మె వేళ.. వైద్య సేవలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

○ డీఎస్‌హెచ్ చక్రధరబాబు ఆదేశాలు
○ ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు ప్రాధాన్యం
○ సెలవులో ఉన్న వైద్యులందరూ విధుల్లోకి ఐఎంఏ వైద్యుల సహకారానికీ పిలుపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ జూనియర్ డాక్టర్స్ (జూడా) సమ్మె నేపథ్యంలో ప్రభుత్వ వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర కార్యాచరణ చేపట్టింది. అందుబాటులో ఉన్న వైద్య మానవ వనరులను అవసరానికి అనుగుణంగా వివిధ ఆసుపత్రుల్లో వినియోగించుకోవాలని, అత్యవసర రోగులను అ-నవసరంగా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు, బోధనాసుపత్రులకు రిఫర్ చేయవద్దని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ కె.వి.ఎన్. చక్రధరబాబు రాష్ట్రంలోని అన్ని డీసీహెచ్ఎస్‌లకు ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.
ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు, ప్రసూతి, ట్రామా, ఐసీయూ, శస్త్రచికిత్స సేవలు యథావిధిగా కొనసాగేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

**సీనియర్ రెసిడెంట్లు, డీఆర్‌పీలను వెంటనే రిలీవ్ చేయాలి**

డీఎస్‌హెచ్ పరిధిలోని జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సీనియర్ రెసిడెంట్లు, డీఆర్‌పీలను వెంటనే రిలీవ్ చేసి సంబంధిత ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్ల వద్ద రిపోర్ట్ చేయించాలని ఆదేశించారు. జూడా సమ్మెతో బోధనాసుపత్రుల్లో ఏర్పడిన వైద్యుల కొరతను భర్తీ చేయడమే ఈ నిర్ణయ ఉద్దేశమని పేర్కొన్నారు.

**సెలవులో ఉన్న వైద్యులందరూ విధుల్లోకి**

ప్రస్తుతం సెలవులో ఉన్న లేదా అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యులను తక్షణమే తిరిగి విధుల్లోకి రప్పించాలని డీసీహెచ్ఎస్‌లను ఆదేశించారు. విధుల్లో చేరిన అనంతరం అవసరాన్ని బట్టి వారి సేవలను ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రుల్లో వినియోగించాలని సూచించారు. దీనిని ప్రత్యేక అత్యవసర చర్యగా పేర్కొన్నారు.

**అదనపు వైద్యుల జాబితా సిద్ధం**

డీఎస్‌హెచ్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సీఏఎస్‌జీఈ, డీసీఎస్‌జీఈ వైద్యుల్లో అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా ఇతర ఆసుపత్రులకు పంపగల వైద్యుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాంటి వైద్యులను డీఎంఈ ఆధీనంలో తాత్కాలిక డిప్యూటేషన్‌పై ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులకు పంపాలని సూచించారు.
ఒకే సంస్థలో ఒకే స్పెషాలిటీలో ఇద్దరికి మించి వైద్యులు పనిచేస్తున్న విభాగాలను గుర్తించి, అవసరమైతే కనీసం ఒకరిని ఇతర ఆసుపత్రులకు కేటాయించాలని పేర్కొన్నారు. అయితే స్థానిక ఆసుపత్రుల్లో సాధారణ, అత్యవసర సేవలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని స్పష్టం చేశారు.

**అనవసర రిఫరల్స్ తగ్గించాలి**

జూడా సమ్మె పరిస్థితుల్లో బోధనాసుపత్రులపై అదనపు భారం పడకుండా రిఫరల్స్‌ను గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న నిపుణులు, వైద్య సదుపాయాల మేరకు రోగులకు జిల్లా, ఏరియా ఆసుపత్రుల్లోనే చికిత్స అందించాలని సూచించారు.
క్లినికల్‌గా తప్పనిసరి అయిన అత్యవసర కేసులను మాత్రమే ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు, బోధనాసుపత్రులకు తరలించాలని స్పష్టం చేశారు.

**108 కేసులకు ప్రత్యేక ట్రయాజ్ విధానం**

108 అంబులెన్స్ సేవలకు సంబంధించిన ట్రయాజ్ ఆధారిత డెస్టినేషన్ ప్రొటోకాల్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. కేటగిరీ-ఏ కేసులను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు డీఎస్‌హెచ్ ఆసుపత్రుల్లోనే చికిత్స చేయాలని, కేటగిరీ-బీ కేసులను మాత్రం సమీప ప్రభుత్వ బోధనాసుపత్రికి నేరుగా తరలించాలని పేర్కొన్నారు.

**వైద్యులకు సాధారణ సెలవులు నిలిపివేత**

సమ్మె కొనసాగుతున్నంత వరకు వైద్యాధికారులకు సాధారణ సెలవులు మంజూరు చేయవద్దని ఆదేశించారు. అత్యవసర, అనివార్య పరిస్థితుల్లో మాత్రమే నిబంధనల ప్రకారం సమర్థ అధికారి అనుమతితో సెలవు ఇవ్వాలని సూచించారు.

**పీపీపీ సేవలు, షిఫ్ట్ విధులు తప్పనిసరి**

పీపీపీ విధానంలో కొనసాగుతున్న క్షేత్రస్థాయి వైద్య సేవలు ఎక్కడా నిలిచిపోకుండా చూడాలని డీసీహెచ్ఎస్‌లకు ఆదేశించారు. వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నిర్ణీత షిఫ్ట్ విధులకు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.
ప్రస్తుతం క్లినికల్ స్పెషలిస్టులు పరిపాలనా లేదా క్లినికల్?తర విధుల్లో డిప్యూటేషన్‌పై ఉన్నట్లయితే వారి వివరాలను సేకరించాలని సూచించారు. డీఎంఈ అవసరాలకు అనుగుణంగా అలాంటి వైద్యులను తిరిగి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రుల్లో క్లినికల్ సేవలకు వినియోగించాలని ఆదేశించారు.

**పీహెచ్‌సీల రెండో వైద్యాధికారుల సేవల వినియోగం**

జిల్లా వైద్య ఆరోగ్య అధికారులతో సమన్వయం చేసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న రెండో వైద్యాధికారుల సేవలను కూడా అవసరాన్ని బట్టి జిల్లా ఆసుపత్రులు, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రుల్లో వినియోగించాలని సూచించారు.

**ఐఎంఏ వైద్యుల సహకారానికీ పిలుపు**

అత్యవసర వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగేందుకు జిల్లాల్లోని స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ప్రైవేటు, ఐఎంఏ వైద్యులను తాత్కాలికంగా విధుల్లో వినియోగించి వైద్యుల కొరతను అధిగమించాలని పేర్కొన్నారు.

**ఎలెక్టివ్ శస్త్రచికిత్సలపై సమీక్ష**

ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఎలెక్టివ్ శస్త్రచికిత్సలను సమీక్షించాలని డీసీహెచ్ఎస్‌లకు ఆదేశించారు. రోగుల అత్యవసరత, అందుబాటులో ఉన్న వైద్య సిబ్బంది ఆధారంగా ఆపరేషన్ థియేటర్ల వినియోగానికి ప్రాధాన్యత క్రమాన్ని పాటించాలని సూచించారు.

## రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి శకటాలు గుంటూరుకు చేరిక




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసే ఉద్దేశంతో వివిధ శాఖలు రూపొందించిన ప్రచార శకటాలు ఆదివారం గుంటూరులో ప్రజల సందర్శనార్థం అందుబాటులోకి వచ్చాయి.
శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్‌స్టాండ్ మీదుగా నగరంలోని పెరేడ్ గ్రౌండ్స్‌కు శకటాలను ప్రదర్శనగా తీసుకురాగా, మార్గమధ్యంలో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.
ఆదివారం ఉదయం శకటాలు స్వామి థియేటర్ వద్దకు చేరుకున్నాయి. అనంతరం మధ్యాహ్నం రింగ్ రోడ్‌లోని వెల్కమ్ హోటల్ పరిసర ప్రాంతాల్లో ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించే శకటాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

## యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచేది క్రీడలే : ఎమ్మెల్యే గళ్ళా మాధవి




○ ఎన్టీఆర్ స్టేడియంలో ఆజాదీ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సందర్శన

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందించి వారిని గంజాయి, మాదకద్రవ్యాలు వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న "ఆజాదీ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్" పోటీలను ఆదివారం ఆమె సందర్శించి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన పెద్ద సంఖ్యలో యువ క్రీడాకారులు టోర్నమెంట్‌లో పాల్గొనడం సంతోషకరమన్నారు. ఐదు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంటూ, విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.
తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకుడు కొనిదె గోపికృష్ణ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా నిరంతరాయంగా ఈ ఛాంపియన్‌షిప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇది కేవలం బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మాత్రమే కాకుండా, యువతలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే వేదికగా నిలుస్తోందని చెప్పారు.
నేటి సమాజంలో కొంతమంది యువత మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాల బారిన పడుతున్న నేపథ్యంలో వారిని సన్మార్గంలో నడిపించేందుకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడం అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువతను మంచి దిశగా నడిపించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్న నిర్వాహకులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.
ప్రతి ఏడాది ఈ క్రీడా పోటీలను మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, కార్యక్రమ విజయవంతానికి సహకరించిన నిర్వాహకులు, క్రీడాకారులు, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్):** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కాకుమాను మండల పరిధిలోని కొమ్మూరు గ్రామంలో గల మదర్స నందు ఘనంగా నిర్వహించారు. ముందుగా జెండా వందనం చేశారు. అనంతరం ముఖ్య అతిదులు అయిన ప్రముఖులు గేరా రత్నం, ఖుద్దుస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ మైనారిటీ నాయకులు డా షేక్ అబ్దుల్ ఖుద్దుస్ లు మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగ ఫలితం గానే ప్రజలందరూ స్వేచ్ఛ కలిగి ఉన్నామన్నారు. యువత ప్రతి ఒక్కరు కూడా తప్పనిసరిగా దేశ భక్తి కలిగి ఉండాలన్నారు.
"1947 ఆగస్టు 15న మన భారతదేశ బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందిందన్నారు. మనమంతా అనుభవిస్తున్న స్వాతంత్ర్యం ఒక రోజులో వచ్చింది కాదు.. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు దీర్ఘకాలం పాటు పోరాటం, త్యాగాల ఫలితంగానే ఇది సాధ్యమైందన్నారు. మహాత్మాగాంధీతో పాటు నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి ఎందరో గొప్ప నాయకుల పోరాటాలు మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టాయని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ప్రముఖులు గేరా రత్నం మరియు పలువురు ప్రముఖులను ఘనంగా సత్కరించ్చారు. అనంతరం పిల్లలకు చాక్లెట్లు, బిస్కెట్లు పంచారు. భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో
గేరా రత్నం, బిజెపి మైనార్టీ నాయకులు షేక్ అబ్దుల్ ఖుద్ధుస్, షేక్ అబ్దుల్ మాజిద్, షేక్ నిజాముద్దీన్, షేక్ పీరా, గుల్లపల్లి బషీర్, గుల్లపల్లి అల్లావుద్దీన్, షేక్ కాసిం, పి గౌస్,జి షబ్బీర్, షేక్ బుజ్జి పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో

### ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో జాతీయ జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభమై, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సమిష్టిగా జాతీయ గీతాన్ని ఆలపించి దేశభక్తిని చాటారు.

కళాశాల ప్రిన్సిపాల్ డి. సంజయ్ జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించారు. దేశ అభివృద్ధిలో యువత కీలక శక్తిగా నిలవాలని, నైపుణ్యాలు, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకుని సమాజ పురోగతికి తోడ్పడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సీతారామయ్య మాట్లాడుతూ, స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి తరం గుర్తుంచుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. బాధ్యతాయుతమైన పౌరులుగా సమాజ సేవకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. త్వరలో ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రాష్ట్ర విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందనున్న నేపథ్యంలో విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అధ్యాపకులు, విద్యార్థులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. విశ్వవిద్యాలయ హోదాతో విద్యార్థులకు ఉన్నత విద్య, పరిశోధన, నూతన ఆవిష్కరణల రంగాల్లో విస్తృత అవకాశాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీహరి మాట్లాడుతూ, దేశ భవిష్యత్ నాయకత్వం యువత చేతుల్లోనే ఉందన్నారు. విద్యతో పాటు దేశభక్తి, సేవాభావం, క్రమశిక్షణను అలవర్చుకుంటేనే ఉన్నత లక్ష్యాలను సాధించగలరని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు దేశభక్తి గీతాలు, ప్రసంగాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.

## సర్దార్ గౌతు లచ్చన్నకు టీడీపీ ఘన నివాళి



- తెనాలి పార్టీ కార్యాలయంలో జయంతి వేడుకలు
- బీసీ ఉద్యమ స్ఫూర్తిని స్మరించిన నాయకులు

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రముఖ బీసీ ఉద్యమ నాయకుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.

తెనాలి టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ఫణిదపు దుర్గా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన బీసీ హక్కుల సాధన కోసం చేసిన సేవలను నాయకులు స్మరించుకున్నారు.

కార్యక్రమంలో తెనాలి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ కుద్దూస్, జొన్నాదుల మహేష్, మాజీ కౌన్సిలర్ బ్రహ్మేశ్వరరావు, చాప్రగడ ఆంజనేయులు, నందం లక్ష్మి, జగడగుంటపాలెం పార్టీ అధ్యక్షుడు రవి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుభాని, శ్రీరామ్ సుభాష్, పూతర్లంక చైతన్య, భాగ్యరాజ్, సంగమేశ్వరరావు, శ్రావణ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అటల్ బిహారీ వాజ్‌పేయికి బీజేపీ ఘన నివాళి



- దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా ఆదివారం విశాఖ బీచ్ రోడ్‌లోని ఆయన విగ్రహం వద్ద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఘన నివాళులర్పించారు. వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం మాధవ్ మాట్లాడుతూ, దేశ రాజకీయాల్లో అజాతశత్రువుగా గుర్తింపు పొందిన వాజ్‌పేయి దేశ అభివృద్ధికి అపూర్వ సేవలు అందించారని అన్నారు. ఆర్థిక, సాంకేతిక, రక్షణ రంగాల్లో భారత పురోగతికి ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య విలువలు, జాతీయత, సుస్థిర పాలనకు వాజ్‌పేయి ఆదర్శప్రాయ నాయకుడని కొనియాడిన మాధవ్, ఆయన చూపిన మార్గదర్శకత్వం నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. భారతరత్న వాజ్‌పేయి దేశానికి అందించిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని అటల్ బిహారీ వాజ్‌పేయికి ఘన నివాళులర్పించారు.

## ఎం.ఎల్.ఏ క్వార్టర్స్ ప్రాంగణాన్ని పరిశీలించిన కలెక్టర్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాజధానిలో నూతనంగా నిర్మించిన శాసన సభ్యుల నివాస గృహ సముదాయ ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ ఆదివారం పరిశీలించారు. ఈ నెల 18వ తేదీన శాసనసభ్యుల ఆత్మీయ కలయిక ఉండే అవకాశాలు ఉండటంతో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ చర్యలు చేపట్టారు. శాసనసభ్యుల నివాస గృహ సముదాయాల వద్ద జరిగే ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తుగా పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో సి. ఆర్. డి. ఏ అదనపు కమిషనర్ అభిషేక్, అదనపు ఎస్పీ ఏ. టి. వి రవి కుమార్, రెవిన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాస రావు, ఎం. టి. ఎం. సి కమిషనర్ అలీం భాషా తదితరులు పాల్గొన్నారు.

## నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి కందుల దుర్గేష్ విస్తృత పర్యటన

- వివిధ అభివృద్ధి, సేవా కార్యక్రమాలు మరియు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి దుర్గేష్
- లయన్స్ క్లబ్ సేవలు కొనియాడదగినవి
- లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి హాజరు



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్):** పెరవలి మండలంలో జరిగిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 'చిన్నా' నాయకత్వంలో బాధ్యతలు స్వీకరించిన నూతన సభ్యులకు మంత్రి దుర్గేష్ అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నిరంతరం ప్రజాసేవలో తరిస్తూ "సేవకు రారాజు"గా లయన్స్ క్లబ్ పేరుగాంచిందని, ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలు నెరవేరడంలో లయన్స్, రోటరీ వంటి స్వచ్ఛంద సంస్థల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. తాము చదువుకునే రోజుల్లో లయన్స్ క్లబ్‌కు అనుబంధంగా ఉన్న 'లియో క్లబ్'లో సభ్యుడిగా చేరి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు మంత్రి గుర్తు చేసుకున్నారు. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల పెంపొందింపునకు లయన్స్ క్లబ్ ఒక మహోన్నత వేదికగా నిలుస్తుందన్నారు. పెరవలి మండల ఔన్నత్యాన్ని చాటుతూ సేవలందించిన పూర్వ అధ్యక్షులు 'రాయుడు' కార్యవర్గాన్ని అభినందించారు. స్థానిక ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా పెరవలి ప్రాంతంలో లయన్స్ క్లబ్ చేపటే అన్ని సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

**శ్రీ పుట్టలమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు:** నిడదవోలు మండలం సూరాపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ పుట్టలమ్మ తల్లి నూతన విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించిన భారీ అన్నసమారాధన కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన:** అనంతరం నిడదవోలు కార్యాలయం వీధి నందు నూతనంగా నిర్మించనున్న "స్వాతి హాస్పిటల్" భవన శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్ పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమిపూజలో పాల్గొని కొబ్బరికాయ కొట్టారు. ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసుకుని, స్థానిక ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని యాజమాన్యానికి సూచించారు

## శ్రీ పాప వినాశన స్వామి దేవస్థానానికి శంకుస్థాపన

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు

**చుండూరు(జర్నలిస్ట్ ఫైల్):** బాపట్ల జిల్లా చుండూరు మండలం ముస్నంగివారిపాలెం గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీ పాప వినాశన స్వామి దేవస్థానం శంకుస్థాపన మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం ప్రార్థించారు.

ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ముస్నంగివారిపాలెంలో శ్రీ పార్వతీ సమేత శ్రీ పాప వినాశన స్వామి దేవస్థానం నిర్మాణానికి శంకుస్థాపన జరగడం గ్రామానికి శుభసూచకమన్నారు. భక్తుల ఆకాంక్షలకు



అనుగుణంగా ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి, ఆధ్యాత్మిక సేవలకు కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. స్వామివారి అనుగ్రహం గ్రామ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశాఖ మహానగరం కాషాయమయం



- పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో నితిన్ నబిన్‌కు ఘన స్వాగతానికి సన్నాహాలు
- కమలం జెండాలతో సాగరనగరానికి సరికొత్త శోభ
- జాతీయ అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేసేందుకు మాధవ్ భారీ ఏర్పాట్లు

**విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్):** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో సాగరనగరం కాషాయమయంగా మారింది. నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు, ముఖ్య ప్రాంతాలను కమలం జెండాలు, బీజేపీ జెండాలతో పార్టీ శ్రేణులు సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఎటుచూసినా కాషాయ జెండాలు రెపరెపలాడుతూ విశాఖ నగరానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి.

బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నితిన్ నబిన్ తొలిసారి విశాఖకు రానుండటంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విశాఖకు తరలివచ్చేలా సమన్వయం చేస్తున్నారు.

నగరంలోని ప్రధాన మార్గాల్లో బీజేపీ జెండాలు, స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి జాతీయ అధ్యక్షుడి పర్యటనకు ఘన స్వాగత వాతావరణాన్ని కల్పించారు. నితిన్ నబిన్ పర్యటన పార్టీ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ మరింత బలోపేతానికి దోహదం చేస్తుందని పార్టీ భావిస్తోంది

జాతీయ అధ్యక్షుడికి అపూర్వ స్వాగతం పలికి విశాఖలో బీజేపీ బలాన్ని చాటేందుకు ప్రతి కార్యకర్త సమాయత్తమవుతున్నారని తెలిపారు. పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, మోర్చాల ప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారు.

# జూనియర్ వైద్యుల సమ్మె...డీఎంఈ అత్యవసర కార్యాచరణ

- సమ్మె ప్రభావం తగ్గించేందుకు డీఎంఈ అత్యవసర చర్యలు
- ప్రభుత్వ బోధనాస్పత్రులకు ప్రైవేటు వైద్యుల తాత్కాలిక డిప్యూటేషన్
- అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ రెసిడెంట్లను తాత్కాలిక డిప్యూటేషన్‌పై పంపించాలని విజ్ఞప్తి
- అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా డీఎంఈ కీలక ఆదేశాలు
- ఎమర్జెన్సీ, ఐసీయూ, ట్రామా, ప్రసూతి సేవలు నిరంతరం కొనసాగించాలని స్పష్టీకరణ



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ వైద్య కళాశాలల జూనియర్ వైద్యుల ఆందోళన నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో అత్యవసర వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా వైద్య విద్యా సంచాలకుల (డీఎంఈ) కార్యాలయం కీలక ఆదేశాలు జారీ చేసింది. అవసరమైన చోట ప్రైవేటు వైద్య కళాశాలల నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీ రెసిడెంట్లను తాత్కాలిక డిప్యూటేషన్‌పై ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఎ. విష్ణువర్ధన్ కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న జూనియర్ వైద్యుల సమ్మె కారణంగా బోధనాస్పత్రుల్లో అత్యవసర విభాగాల పనితీరుపై ప్రభావం పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఎంఈ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలకు ప్రాణాధారమైన వైద్య సేవలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకుండా అన్ని వైద్య కళాశాలలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**ఐదు కీలక విభాగాలకు నిపుణుల సేవలు**

పిల్లల వైద్యం (పీడియాట్రిక్స్), మత్తు వైద్యం (అనస్థీషియా), జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, ప్రసూతి–స్త్రీ వైద్యం విభాగాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి నిపుణులను సమీప ప్రభుత్వ బోధనాస్పత్రులకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. అదనంగా డీఆర్‌పీ (ఐసీదీ/ౠ+) రెసిడెంట్ వైద్యులను కూడా సేవల కోసం వినియోగించవచ్చని సూచించారు.

అయితే పీజీ రెసిడెంట్లను స్వతంత్ర వైద్యులుగా కాకుండా సీనియర్ అధ్యాపకులు లేదా నిపుణుల ప్రత్యక్ష పర్యవేక్షణలో మాత్రమే విధుల్లో వినియోగించాలని స్పష్టం చేశారు. వారికి ఎలాంటి స్వతంత్ర వైద్య బాధ్యతలు అప్పగించరాదని ఆదేశాల్లో పేర్కొన్నారు.

**ఎమర్జెన్సీ, ఐసీయూ సేవలు నిరంతరం కొనసాగాలి**

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ బోధనాస్పత్రులు ఎమర్జెన్సీ, ఐసీయూ, ట్రామా కేర్, ప్రసూతి విభాగం, నవజాత శిశువుల సంరక్షణ, అత్యవసర ఆపరేషన్ థియేటర్లలో సేవలను 24 గంటలు నిరంతరం కొనసాగించేలా చర్యలు చేపట్టాలని డీఎంఈ ఆదేశించింది.

సీనియర్ అధ్యాపకులు, సీనియర్ రెసిడెంట్లు, కన్సల్టెంట్ వైద్యులతో ప్రత్యేక అత్యవసర డ్యూటీ రోస్టర్లు రూపొందించి తగిన మానవ వనరులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించింది.

**మందులు, రక్తం, ఆక్సిజన్ సిద్ధంగా ఉంచాలి**

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన మందులు, రక్త నిల్వలు, ఆక్సిజన్ సరఫరా, వెంటిలేటర్లు, మానిటర్లు తదితర అత్యవసర వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రోగుల చికిత్సలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్లకు సూచించారు.

**ఎలక్టివ్ శస్త్రచికిత్సలు తగ్గించాలి**

సమ్మె కొనసాగుతున్న పరిస్థితుల్లో అత్యవసర రోగులకు ప్రాధాన్యం కల్పించేందుకు అవసరమైతే ఎలక్టివ్ (ముందస్తు ప్రణాళికతో చేసే) శస్త్రచికిత్సలను తాత్కాలికంగా తగ్గించాలని డీఎంఈ పేర్కొంది. దీంతో అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందిని అత్యవసర సేవలకు వినియోగించుకోవచ్చని తెలిపింది.

**రోగుల తరలింపుపై స్పష్టమైన మార్గదర్శకాలు**

అత్యవసర రోగులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని, ప్రాథమిక చికిత్స అనంతరం అవసరమైతే మాత్రమే ఇతర ఆస్పత్రులకు తరలించాలని ఆదేశించారు. రిఫరల్‌కు ముందు గమ్య ఆస్పత్రిలో పడకల లభ్యత, అవసరమైన నిపుణుల అందుబాటు తప్పనిసరిగా నిర్ధారించాలని స్పష్టం చేశారు.

**రోజువారీ పర్యవేక్షణ తప్పనిసరి**

ప్రతి ప్రభుత్వ బోధనాస్పత్రి రోజువారీగా సిబ్బంది హాజరు, అత్యవసర రోగుల సంఖ్య, ఐసీయూ ఆక్యుపెన్సీ, ప్రసవాల సంఖ్య, నిర్వహించిన శస్త్రచికిత్సలు, ఇతర కీలక వైద్య సేవల వివరాలను వైద్య విద్యా సంచాలకుల కార్యాలయానికి నివేదించాలని ఆదేశించారు. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన అదనపు చర్యలు చేపట్టనున్నట్లు డీఎంఈ వెల్లడించింది.

# ఉద్యోగులారా మేల్కొండి.. ఉద్యమానికి సిద్ధంకండి : ఏపీ జేఏసీ అమరావతి

- ఈనెల 28న విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు - అదే రోజు ఉద్యమ కార్యాచరణ ప్రకటన
- ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జాప్యం ఇక సహించేది లేదు: ఏపీ జేఏసీ అమరావతి



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించింది. ఈనెల 28న విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించి, అదే రోజు ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు వెల్లడించారు.

ఆదివారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటేరియట్, ఉద్యమ కార్యాచరణ కమిటీ సంయుక్త సమావేశం జరిగింది. ఉద్యోగుల బకాయిలు, డీఏలు, మధ్యంతర భృతి, పీఆర్సీ, ఇతర ఆర్థిక ప్రయోజనాలు, ప్రభుత్వ వైఖరి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించి పలు కీలక తీర్మానాలు చేశారు.

**సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం**

సమావేశాన్ని ఉద్దేశించి బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా, పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ముందడుగు పడలేదన్నారు. ఉద్యోగుల హక్కులు, ఆత్మగౌరవం, భవిష్యత్ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన పరిస్థితిని ప్రభుత్వమే కల్పించిందని వ్యాఖ్యానించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, ఆర్థిక ప్రయోజనాలు, మధ్యంతర భృతి, పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవడం లేదన్నారు. పదేపదే విజ్ఞప్తులు చేసినప్పటికీ సమస్యలు అలాగే కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

**రూ.40 వేల కోట్ల బకాయిలపై సమాధానం చెప్పాలి**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సుమారు రూ. 40 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ప్రజలకు వివరించాలని బొప్పరాజు డిమాండ్ చేశారు. గత రెండేళ్లుగా ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల పూర్తి వివరాలను ప్రభుత్వం ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు.

"ఉద్యోగులు ప్రభుత్వం నుంచి కొత్తగా ఏమీ అడగడం లేదు. తమకు రావాల్సిన న్యాయమైన హక్కులనే కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించిన మొత్తంలో అధిక భాగం ఉద్యోగులు తమ జీతాల నుంచి దాచుకున్న సొమ్మే. అయినప్పటికీ హక్కుల కోసం ప్రశ్నిస్తున్న ఉద్యోగులను ప్రజల ముందు దోషులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేయడం బాధాకరం" అని అన్నారు.

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని కాపాడుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గుర్తు చేస్తూ, న్యాయమైన ఆర్థిక ప్రయోజనాలను చెల్లించకపోవడమేనా ఉద్యోగుల పట్ల ఫ్రెండ్లీ ప్రభుత్వ వైఖరి అని ప్రశ్నించారు.

**ఉద్యమానికి ప్రభుత్వమే బాధ్యత**

పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శించారు. సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వమే ఉద్యోగులను ఉద్యమం వైపు నడిపిస్తోందన్నారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ ఉద్యమం ఉద్యోగుల న్యాయమైన హక్కులు, ఆత్మాభిమానాన్ని కాపాడుకోవడం కోసం, భవిష్యత్ తరాల ప్రయోజనాల కోసం చేపట్టే ప్రజాస్వామ్య పోరాటమని స్పష్టం చేశారు.

దీర్ఘకాలిక ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారం రావాలంటే ఉద్యమమే సరైన మార్గమని, ప్రజాస్వామ్యంలో హక్కుల సాధన కోసం పోరాటం చేయడం ప్రతి ఉద్యోగి హక్కు అని పేర్కొన్నారు.

**28న రాష్ట్రస్థాయి సదస్సు – ఉద్యమ షెడ్యూల్ విడుదల**

ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో గతంలో వాయిదా వేసిన ఉద్యమ కార్యాచరణను మరింత ఉధృతంగా కొనసాగించాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాల సన్నద్ధ సభలకు బదులుగా నేరుగా విజయవాడలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించాలని తీర్మానించింది.

ఈనెల 28న జరిగే సదస్సుకు ఏపీ జేఏసీ అమరావతి పురుష, మహిళా విభాగాలకు చెందిన రాష్ట్ర, జోనల్, జిల్లా, డివిజన్ స్థాయి నాయకులు హాజరుకానున్నారు. ఉద్యోగుల సమస్యలపై సమగ్రంగా చర్చించి, ప్రభుత్వ వైఖరిని సమీక్షించిన అనంతరం అదే రోజు ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్‌ను ప్రకటించనున్నట్లు ఉద్యమ కమిటీ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు తెలిపారు. సదస్సులో ఆమోదించే తీర్మానాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వెంటనే అధికారిక నోటీసు అందజేయాలని, ఉద్యోగులు, పెన్షనర్ల హక్కుల పరిరక్షణ కోసం కలిసి వచ్చే అన్ని ఉద్యోగ, పెన్షనర్ సంఘాలను ఉద్యమంలో భాగస్వాములను చేయాలని సమావేశం నిర్ణయించింది.

**ఐక్యంగా పోరాడాలి...**

"ఇప్పుడు ఉద్యోగులంతా ఒక్కటై ఉద్యమానికి సిద్ధం కాకపోతే భవిష్యత్ తరాలకు తీరని నష్టం జరుగుతుంది. ఈరోజు మన హక్కుల కోసం నిలబడకపోతే రేపటి తరానికి మనమే సమాధానం చెప్పాల్సి వస్తుంది. ప్రతి ఉద్యోగి ఐక్యంగా ఉద్యమానికి సిద్ధం కావాలి" అని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు సంయుక్తంగా పిలుపునిచ్చారు. ఉద్యమం కారణంగా భవిష్యత్‌లో ప్రజలకు ఏదైనా అసౌకర్యం కలిగితే అందుకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, దాని బాధ్యత ప్రభుత్వానిదేనని హెచ్చరించారు.

సమావేశంలో ఉద్యమ కమిటీ చైర్మన్ టి.వి. ఫణిపేర్రాజు, రాష్ట్ర కోశాధికారి తిమ్మసర్తి నాగేశ్వరరావు, మహిళా విభాగం చైర్‌పర్సన్ పి. లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. కిషోర్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ ఆర్. శ్రీనివాసరావు, కో–చైర్మన్లు చెవ్వూరి రవి, సంసాని శ్రీనివాసరావు, ఎస్. మల్లేశ్వరరావు, పి. వి. ఎన్. శాస్త్రి, జి. శివానందరెడ్డి, వైస్ చైర్మన్లు టి. జయప్రకాశ్, ఎ. కుమార్ రెడ్డి, కె. వెంకటేశ్వరరావు, వివిధ శాఖల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగ ప్రతినిధులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా, డివిజన్ స్థాయి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467